J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 14




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 1 09.6.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# Why Is 'Unique Spire' Your Unique Destination!

UNIQUE SPIRE




Live life the urban way, in our very own Nellore. Bringing a unique residential experience that resonates with luxury, an elevated lifestyle and an elite enclosure that fulfills your aspirations with happiness and delight.













ANDHRA PRADESH REAL ESTATE REGULATORY AUTHORITY
AP RERA
REGISTERED NUMBER
P09480262733






**Indoor Amenities**

- Swimming Pool
- Badminton Court
- Gym / Spa
- Indoor Games
- Yoga / Meditation
- Banquet Hall
- Multipurpose Hall

**Outdoor Amenities**

- Landscaped Gardens
- Cricket Practice Net
- Tennis Court
- Jogging Track
- Children's Play Area
- Elders Seating Plaza
- Amphitheatre

Hitha Designs (+91-40-2330 6819) www.hitha.com

UNIQUE PROJECTS

Site Office:
Muthukur Road,
Harinathpuram, Nellore Town,
SPSR Nellore Dist., A.P.

+91 9 6767 9 6868

www.uniqueprojects.in info@uniqueprojects.in

/uniqueprojects_nellore
/company/unique-projects-nellore
/Uniqueprojectsnellore
/UniqueProjsnlr

LOCATION

J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 14

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 1 09.6.2023, శుక్రవారం వెల : రూ. 5 /-

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## లాయర్ నిర్భయంగా నిరాటంకంగా నిస్పక్షపాతంగా

ఒక ఉద్యమస్ఫూర్తికి నలభై రెండేళ్లు నిండాయి. నిస్వార్థ పోరాట దీప్తికి నలభై రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. ఒక చరిత్రాత్మక సంస్థని, సంస్థ ఆస్తులని కాపాడడమే లక్ష్యంగా పురుడుపోసుకున్న మన లాయర్ పత్రికకు నలభై రెండు వసంతాలు నిండాయి. జూన్ 5, 2023న, నెల్లూరీయుల మానస పుత్రిక మన లాయర్ పత్రిక 42 సంవత్సరాలు పూర్తి చేసుకుని 43వ ఏట అడుగుపెట్టింది.

నాటి 1981 నుండి నేటి 2023 వరకు ఎన్నో సవాళ్లను లాయర్ ఎదుర్కొంది. ఈనాటికీ ఎదుర్కొంటూనే ఉంది. అప్పటికీ ఇప్పటికీ కాలం మారింది. తరాలు మారాయి. పరిస్థితులు మారాయి. సమాజం మారింది. జనజీవన విధానం మారింది. వాటితో పాటు మనుషుల మనస్తత్వాలు, వారి ప్రవర్తన, నడవడికా కూడా మారాయి. వాటన్నిటితో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థలలో నాలుగవ స్తంభంగా పిలువబడే మీడియా పోకడ కూడా మారింది. మీడియా సంస్థల యాజమాన్యాలు సైతం వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత కల్పిస్తూ పత్రికలను, ఛానళ్లను నడుపుతున్నాయి. యాజమాన్యాల ఆలోచనలకి తగ్గట్లుగా తమ విధులు నిర్వహిస్తూ సదరు సంస్థల ఉద్యోగులు కూడా యాజమాన్య బాట పట్టి తమ స్వప్రయోజనాల వైపే మొగ్గు చూపుతున్నారు.

ముఖ్యంగా సామాజిక మాధ్యమాలలో యూట్యూబ్ ఛానళ్ల జాతర మొదలైన తరువాత విలువలకు పాతర పడిందనడంలో ఎలాంటి సందేహం అక్కరలేదు. ఒకప్పుడు జర్నలిజంకి కోర్సులు ఉండేవి. పాత్రికేయ వృత్తిలో తలపండిన మేధావులు శిక్షణా తరగతులు నిర్వహించేవారు. ఒక వార్త లేదా వ్యాసం రాసేటప్పుడు ఎక్కడ కామాలు ఉండాలి, ఎక్కడ ఫుల్‌స్టాప్‌లు ఉండాలన్నది కూడా ప్రత్యేకంగా వివరించేవారు. భుజానికి గుడ్డ సంచి, చేతిలో పెన్నుతో పాటు చిన్నసైజు పుస్తకం పట్టుకున్నవాడు ఒకనాటి జర్నలిస్టు. ఇప్పుడు పరిస్థితి అది కాదు. చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు. అందులోనే చిత్రీకరించి, దాంట్లోనే ఎడిట్ చేసేసి అయిదు నిముషాల్లో యూట్యూబ్‌లో అప్లోడ్ చేసేస్తున్నారు. వీడియోలో ఏం చూపిస్తున్నారో, వాయిస్ ఓవర్లో ఏం మాట్లాడుతున్నారో, వాళ్ళు చేసిన వీడియో వాళ్ళు చూసినా వాళ్ళకే అర్థం కాని అయోమయ పరిస్థితులలో ఆ వీడియోలు ఉంటున్నాయి. క్షణానికి ఒక న్యూస్ వీడియో యూట్యూబ్ ఛానళ్లలో అప్లోడ్ అవుతూనే ఉంటుంది. మరోవైపు కొన్ని న్యూస్ ఏజెన్సీలు కూడా స్లైడ్‌ల రూపంలో నిమిషానికి 10 వార్తలని సామాజిక మాధ్యమాల ద్వారా వీక్షకులకు చేరవేస్తున్నాయి.

ఇలాంటి పోటీ వాతావరణంలో స్థానిక పత్రికల పరిస్థితి దయనీయంగా తయారయ్యింది. పత్రికలనే జీవనోపాధిగా చేసుకుని జీవించే చాలా కుటుంబాల బ్రతుకు దుర్లభంగా మారింది. కొత్త తరం రాజకీయ పార్టీలు, వాటి నాయకుల పోకడ వల్ల కూడా చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నయా నాయకులు భయోత్పాత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. వారి గురించి ఒక్క నిజం రాసినా.. కలంపై కత్తి పెడుతున్నారు. పత్రికలు మూయించేస్తాం అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. పత్రికలు, ఛానెళ్ళు తమ పార్టీకే కొమ్ము కాయాలని షరతులు పెడుతున్నారు. కాదని ఎదురుతిరిగితే తమ పక్కన తిరిగే చిల్లర మూకలను ఉసికొల్పి దాడులకు తెగబడుతున్నారు.

ఇలాంటి పరిస్థితులలో నిర్భయంగా, నిరాటంకంగా, నిస్పక్షపాతంగా వారం వారం తన అక్షర సమరాన్ని కొనసాగిస్తోంది మన లాయర్. తమ గుండెల నిండా లాయర్ పై ప్రేమను నింపుకుని, మీకు అండగా మేమున్నాం అంటూ లాయర్‌ని ముందుకు నడిపిస్తున్న మహానుభావులు ఎందరో ఉన్నారు, వారందరికీ వందనాలు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న లాయర్ పాఠకులకి, చందాదారులకి, ప్రకటనకర్తలకి మా కృతజ్ఞతాపూర్వక అభివందనాలు. మీరందిస్తున్న ప్రోత్సాహమే ఉత్సాహంగా ముందుకు సాగుతూ, 43వ ఏట అడుగుపెట్టిన ఆనంద తరుణంలో అక్షరసేవలో పునరంకితమవుతోంది మన లాయర్...!

తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)




## అంధకారానికి అలంకారం

మనం చరిత్రలో ఎంతోమంది పాలకుల గురించి చదివాం, మరెంతో మంది పాలకుల గురించి తెలుసుకున్నాం. పావురం ప్రాణం కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టిన శిబి చక్రవర్తి గురించి చదివాం. మూడు అడుగులు ఇస్తానని ఇచ్చిన మాట కోసం మారు మాట్లాడకుండా పాతాళానికి వెళ్ళిపోయిన బలి చక్రవర్తి గురించి విన్నాం. లోక ప్రజల క్షేమం కోసం కుమార్తెను ఓ సన్యాసికి ఇచ్చి పెళ్ళి చేసిన దశరథ మహారాజు జీవితం గురించి తెలుసుకున్నాం. ఇక శ్రీరామ చంద్రుని మాట సరేసరి. ప్రజల మాట కోసం భార్యను కూడా వదలగలిగేంతటి పెద్ద నిర్ణయం తీసుకున్నాడు. అందుకే చరిత్రలో వీరందరి పేర్లు చిరస్థాయిగా నిలిచాయి. నేటికీ రాజు అనగానే మన మనోఫలకంపై నిలబడి గర్వంగా ముందు తరాలకు పరిచయం అవుతున్నాయి.

12లో



లాయర్
జూన్ 09, 2023

# 'వందే భారత్' యుగంలోనూ.. ఘోర రైలు ప్రమాదాలా?

ఒక ప్రమాదం ఎంత భయానకంగా ఉంటుందో...ఎంత భీభత్సం సృష్టిస్తుందో, ఎందరి జీవితాలను అల్లకల్లోలం చేస్తుందో, మరెందరి ప్రాణాలు బలి తీసుకుంటుందో తెలుసుకోవడానికి ఇటీవల ఒరిస్సాలో ఒకేసారి, ఒకే ఘటనలో మూడు రైళ్ళు ఢీకొట్టుకొని జరిగిన ఘోరప్రమాదం ఒక తాజా ఉదాహరణ. ఇది నిజంగానే మాటలతో వర్ణించలేని మహా విషాదం. ఇటీవలికాలంలో దేశంలో జరిగిన అతిపెద్ద రైలు ప్రమాదం. హఠాత్తుగా జరిగిన ఈ దుర్ఘటనలో ఒక్కసారిగా ప్రయాణీకుల గుండెలు చెదిరిపోయాయి. ఆర్తనాదాలు, హాహాకారాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. కాళ్ళు తెగి, తలలు తెగిపోయి, ప్రమాదంలో శరీరాలు నుజ్జునుజ్జయిపోయి, బోగీల్లోంచి నెత్తురు వరదలా పారి పట్టాలను రక్తసిక్తం చేసిన భయానక భీభత్స భయంకర దృశ్యాలు దేశప్రజల కంటనీరు తెప్పించాయి. బాధితులు, మృతుల కుటుంబాల రోదనలు మిన్నుముట్టాయి. అత్యంత వేగవంతమైన 'వందేభారత్ రైళ్ళ' వచ్చేశాయని సంబరపడుతున్న సమయంలో, ఈ వందేభారత్ యుగంలోనూ ఇలాంటి దుర్ఘటనలు విషాదంతో.. నోటమాట రాకుండా చేస్తున్నాయి.

బెంగుళూరు నుంచి పశ్చిమబెంగాల్‌లోని హౌడాకు వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇటీవల బాలేశ్వర్ సమీపంలోని బహనగా బజార్ వద్ద రాత్రి 7 గంటల సమయంలో పట్టాలు తప్పడం, దాని బోగోలు పట్టీలు కొట్టి పక్కనున్న మరో ట్రాక్‌పై పడిపోవడం, దాంతో అటుగా వేగంగా వస్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఆ బోగీలను ఢీకొట్టడం, అంతలోనే బోల్తాపడ్డ కోరమాండల్ బోగీలను ఇంకొక ట్రాక్‌పై వస్తున్న గూడ్స్‌రైలు ఢీకొనడం.. ఇలా మూడురైళ్ళు ఒకదానికొకటి ఢీకొట్టుకోవడం అంతా కొద్దిసేపట్లోనే జరిగిపోయాయి. దీంతో ఆ రైళ్ళలో ఉన్న ప్రయాణీకులు పెద్దపెట్టున హాహాకారాలు చేశారు. అప్పటికే రైల్వేట్రాక్‌లు రక్తంతో నిండిపోయాయి. ధ్వంసమైన బోగీల్లో చిక్కుకున్న ప్రయాణీకుల మృతదేహాలు చితికి ఛిద్రమైపోయాయి. ఈ ఘోర రైళ్ల ప్రమాదంలో 278 మంది ప్రయాణీకులు తమ ప్రాణాలు పోగొట్టుకోవడం దారుణం..దారుణాతి దారుణం..అత్యంత బాధాకరం. కనీసం మరో 1200 మంది వరకు తీవ్రగాయాలతో గోడుగోడుమంటున్నారు. ఇది భారతీయ రైల్వే చరిత్రలోనే ఒక భయంకరమైన దుర్ఘటన. ఈ ఘోర రైలుప్రమాదంలో సుమారు 40 మృతదేహాలపై ఎలాంటి గాయాలు లేకపోవడం చూస్తే, బోగీల పైనుంచి విద్యుత్‌తీగలు తెగిపడడం వల్ల విద్యుత్‌షాక్‌కు గురై ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోయి ఉంటారని కూడా భావిస్తున్నారు. అందులోనూ ఈ ప్రమాదం మానవతప్పిదం వల్ల జరిగినట్లు అనుమానిస్తున్నారు. భద్రతావ్యవస్థ లోపం ఒక శాపంగా పరిణమించిందని అంటున్నారు. అందుకు తగ్గట్టే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ చివరిక్షణాల్లో అనూహ్యంగా లూప్‌లైన్ లోకి వెళ్ళడం ఏమిటన్నది ఇంకా మిస్టరీగానే మిగిలింది. సిగ్నల్ పాయింట్‌లో అత్యంత కట్టుదిట్టమైన సాంకేతిక నైపుణ్యంతో ఉన్న లాకొస్టమ్‌లో లోపం వల్లనే ఇంతటి భారీ ప్రమాదం జరిగి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, ఈ పెనుప్రమాదం వెనుక ఏదైనా కుట్ర కోణం కూడా ఉండొచ్చేమోననే సందేహాలు కూడా లేకపోలేదు.

ప్రపంచవ్యాప్తంగా ఎంతో పటిష్టమైన సాంకేతిక వ్యవస్థలు, అత్యంత అధునాతనమైన పరిజ్ఞానం అందుబాటులో ఉన్న నేటికాలంలో ఇంకా ఇలాంటి ప్రమాదాలు జరుగుతుండడం మనం ఎంతగా వెనుకబడివున్నామో చెప్పడానికి ఒక ప్రత్యక్ష ఉదాహరణ. రైలుపట్టాలపై జరిగే ప్రమాదాలకు అంతమెప్పుడో తెలియడం లేదు. మానవ తప్పిదాలతోనో, భద్రతా వ్యవస్థ లోపాలతోనో...కారణాలేమైతేనేం పెద్దసంఖ్యలో ప్రయాణీకులు ఇలాంటి ప్రమాదాల్లో మృత్యుఒడికి చేరిపోతుండడం, వారి కుటుంబాలు పెద్దపెట్టున అయినవారి కోసం రోదిస్తుండడం దయనీయం. వారి హృదయావేదనను ఎవరు తీర్చగలరు.. బాధితులను ఎవరు ఓదార్చగలరు?.. ఇకనైనా మేల్కోవాలి. మృతుల కుటుంబాలకు, బాధితులకు బాసటగా ఉంటూ వారికి, వారి జీవితాలకు అవసరమైన సాయమంతా చేయాలి. ఈ ఘోర దుర్ఘటన ఎందుకు జరిగిందో అనుమానాలు తేల్చి, ఒకవేళ కుట్ర కోణమేమైనా ఉంటే ఛేదించి, ఇన్ని వందల మంది ప్రయాణీకుల ప్రాణాలు పోవడానికి కారకులైనవారిని కఠినంగా శిక్షించాలి. రైల్వే వ్యవస్థలో అన్నిరకాల భద్రతలను మరింత కట్టుదిట్టం చేయాలి. మళ్ళీ మళ్ళీ ఇలాంటివి పునరావృతం కాకుండా సాంకేతిక-సమాచార భద్రతా వ్యవస్థలను.. మొత్తంగా రైల్వేవ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసైనా సరే, ముందుముందు ఇలాంటి ఘోరాలు జరగకుండా చూడాలి.

# పార్టీ సాయి.. విజయసాయి!



అబ్బయ్యా విజయసాయిరెడ్డి పేరు ఇన్నావు కదా..! ఆయన్ది మన జిల్లానేలే. ఆయన సొంతూరు ముత్తుకూరు మండలం తాళ్లపూడి. సొతహాగా ఆయన రాజకీయ నాయకుడు కాదు. నాకు తెలిసి ఆయన కుటుంబం కూడా ఎప్పుడూ రాజకీయాలలో లేదు. ఆయన మాత్రం ఇప్పుడు మన రాష్ట్రాన్ని యాల్తావున్నాడు. ఇక్కడే కాదులే ఢిల్లీలో కూడా చకరం తిప్పుతా వుండాడు. రాజశేకర్‌రెడ్డి వున్నప్పటినుండే వాళ్ళ కంపెనీ యాపార లెక్కలన్నీ సాయిరెడ్డే చూసేవోడు. పెద్దాయన ముఖ్యమంత్రి అయ్యే దాకా సాయిరెడ్డి మద్రాసులోనే వుండేవోడు. అక్కడ ఒకపక్క లెక్కలు చూసుకుంటూ ఇంకోపక్క యాపారాలు కూడా సేసి బాగానే ఎనకేసుకున్నాడనుకో. తమాషా ఏందంటే అబ్బయ్యా... ఆయన రాజకీయాలలోకి వత్తాడని ఎవురూ అనుకోలా. ఆయన కూడా అనుకోనుండడేమో. రాజశేకరరెడ్డి ముఖ్యమంత్రి కావడం సాయిరెడ్డి బతుకు మార్చేసింది. జమ కరుసు లెక్కలు సూసుకోవడంలో జగన్ మోహన్‌రెడ్డికి సాయిరెడ్డి బుర్ర అవసరం కావడంతో ఆయనని మదరాసు నుండి అయిదరాబాదుకి పిలిపించారు. అక్కడే మకాం పెట్టించారు. బ్యాంకిలో డైరెటర్ పదవి ఇప్పించారు. టీటీడీ మెంబర్ని చేశారు. సిన్నంగా సాయిరెడ్డికి అదికారం రుచి




సూపించారు. ఒకపక్క జగన్ లెక్కలు సూత్తానే తన లెక్క తాను సూసుకున్నాడు. ఇదేశాలకి డబ్బు ఎలా పంపాలా.. మళ్లీ ఆ డబ్బులు ఎనక్కి ఎలా తేవాలా... బినామీ కంపెనీలు ఎలాపెట్టాలా... నలుపుని తెలుపుగా ఎలా మార్చాలా... లాంటి ఇసయాలలో సాయిరెడ్డి దిట్ట. ఆ తెలివే ఆయనకి బాగా పనికొచ్చింది. రాజశేకరరెడ్డి కుటుంబానికి తలలో నాలికలా, జగన్‌కి కుడిభుజంలా సేవచేశాడు. ఆ కుటుంబం కోసం జైలుకి కూడా ఎల్లాడు. జగన్‌మోహన్‌రెడ్డి కూడా సాయిరెడ్డిని వదిలైలా, రెండు సార్లు రాజ్యసభ ఇచ్చాడు. పార్టీలో పాముఖ్యత కల్పించాడు. 2019కి ముందు పార్టీ డబ్బు పెత్తనమంతా సాయిరెడ్డికే అప్పజెప్పాడు.

అయితే అబ్బయ్యో... ఈ మధ్య ఏదో తేడా వచ్చిందని అందరూ సెప్పుకుంటున్నారు. ఇసాకపట్టణాన్ని యాల్తా వుండిన సాయిరెడ్డిని ఉన్నట్టుండి జగన్ ఎనక్కి పిలిపించి నువ్వు పార్టీ పనులు సూసుకో అని పురమాయించాడంట. సాయిరెడ్డి కూడా శానా రోజులు గమ్మునానే ఉన్నేడు. మధ్యలో శానా జరిగాయిలే. సాయిరెడ్డి మరదలి అల్లుడు తారకరతన సచ్చిపోవడం, తెలుగుదేశమోళ్లతో సాయిరెడ్డి పూసుకొని తిరగడం, పేపర్‌లో కరమంత్రం ప్రకటనలో అమ్మాయి నాయన పేరు ఏయకుండా సాయి పెదనాయన పేరు ఏయడం, ఇలాంటియి సానా ఇసయాలు ఆడా ఈడా మాట్టాడుకున్నారు.

సాయిరెడ్డి కూడా సానా లోతు మనిషంట అబ్బయ్యో...! ఆయనతో పాటు సదువుకున్నోళ్ళు సెప్పావుంటారు. జగన్ గెలిచిన తరువాత ఆయన ఎవరి ఫోన్లు కూడా ఎత్తుకోవడంలేదంట. ఆయన కోసం పనిచేసిన వాళ్లకి టైము కూడా ఇవ్వడంలేదంట. పొద్దుగూకులూ ఢిల్లీలో లెక్కలు చేసుకోవడానికే టైం సాలడం లేదని సెప్తుంటారు. విశాఖ నుండి తీసకచ్చి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పనులు అప్పజెప్పినా సానా రోజులు పార్టీ ఆఫీస్ సాయి కూడా సూల్లేదంట. మొన్న మంగళారం రోజు సానారోజులకి మా సాయిరెడ్డి పార్టీ ఆఫీసుసాయి సూశాడని శానామంది సంబరం చేసుకుంటున్నారంట. ఎలచ్చన్లు వచ్చేస్తున్నాయి కాబట్టి ఇంక ఎప్పుడు ఫోన్ చేసినా ఆయన ఎత్తుకుంటాడని ఆయన ప్రెండ్సు కూడా యాపీగా ఉన్నారంట. ఇన్ని రోజులూ ఢిల్లీలో వున్నా మళ్లా ఎన్నికల యాలకి జనాల్లోకి రావాల్సిందే కదా...! అని ఆయన పార్టీవోళ్ళే సెవులు కొరుక్కుంటున్నారంట. ఏది ఏదైనా కానీ అబ్బయ్యా, ఎలచ్చన్లు వత్తున్నాయంటే ఎంతటోడైనా బజార్లోకి రావాల్సిందే, మన సాయిరెడ్డి ఎంత సెప్పు...! కాబట్టే ఇన్నీ రోజులూ ఢిల్లీ సాయి, మబ్బుల సాయి చూసినాయన ఇప్పుడు పార్టీ సాయి సూత్తున్నాడు. 'ఇదబ్బయ్యా.. మందల'.

**- సదువుకోని సుబ్బయ్య**

# పర్యావరణ పరిరక్షణ మాటల్లోనేనా?

జూన్ 4న ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో పర్యావరణానికి సంబంధించి ర్యాలీలు, సభలు, సమావేశాలు జరగడం సంతోషకరం. పర్యావరణం, ప్రకృతి వనరులు పరిరక్షణం గురించి ఏ ఒక్కరికో, లేక కొద్దిమందికో కాదు. అది అందరి బాధ్యత. అయినా, వాస్తవానికి ఎవరు పట్టించుకుంటున్నారు? చెట్లు కొట్టేయబాకండి నాయనా అని నెత్తీనోరు మొత్తుకుంటున్నా, ఎవరి పాటికి వారు చెట్లు రోడ్లకి అడ్డం వచ్చేస్తున్నాయని కొట్టేస్తున్నారు. వనాలను సంరక్షించాలంటున్నారు కానీ, సంరక్షించేదెవరు? పొలాల్లో ఉన్న చెట్లన్నీ కొట్టేసి, ఇళ్ళస్థలాలు చేసి అమ్మేసుకుంటున్న నేటి రోజుల్లో పర్యావరణం ఎవరికి పడుతుంది?.. సముద్ర తీరంలో ఉన్న పెద్దపెద్ద చెట్లు, తాటిచెట్లు, ఈతచెట్లు, మడచెట్లు అన్నీ అక్రమార్కులు కొట్టేసుకుని పోతున్నారు. ఎవరడుగుతున్నారనీ?.. పెద్దపెద్ద చెట్లన్నీ కొట్టిపారేసి, చిన్నచిన్న మొక్కలు నాటుకోండి అని చెప్పుకోవడాన్ని ఏమనుకోవాలి?..అసలే ఎండలు మండిపోతున్నాయి. మొక్కలకి నీళ్ళు పోసేదెవరు?..అవి పెద్దయ్యేదాకా కాపాడేదెవరు?...రోడ్లమీద నడవాలంటే పాదచారుల ప్రాణాలు పోతున్నాయి. నీడ అనేదే లేకుండా పోయింది. నగరంలో ఒక్క చెట్టయినా రోడ్డపక్క పచ్చగా కనిపిస్తోందా?.. ఎవరో కొంతమంది అధికారులు, స్వచ్ఛంద సేవకులు కొందరు పర్యావరణం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కానీ, ఏ కొద్దిమందో అనుకుంటే పర్యావరణం బాగుపడుతుందా?..ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో, పట్టుదలతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. పచ్చదనాన్ని కాపాడుకోవాలి. పర్యావరణం బాగుంటేనే మానవులకు మనుగడ అని, లేకుంటే అకాల వర్షాలు, మండుటెండలు, కరువు కాటకాలు, ప్రకృతి విపత్తుల వంటి నరకయాతనలు తప్పవని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ప్రభుత్వం, జిల్లా అధికారులు, గ్రామగ్రామాన ఉండే అధికారులు, స్వచ్ఛంద సంస్థల వారు, యువకులు అందరూ ఏకమై పర్యావరణ పరిరక్షణకు కంకణం కట్టుకున్నప్పుడే కనీసం ఆ దిశగా ఒక్క అడుగైనా ముందుకు పడుతుంది. అప్పుడే ఇలాంటి మాటలకు సార్థకత ఉంటుంది.

*బి.ఎస్ రాములు*, **నెల్లూరు.**




# 'లాయర్'లో.. 'ఉచితాల వ్యాసం' బాగుంది

జూన్ 2 లాయర్‌లో 'ఏ నేతను చూసినా ఏమున్నది గర్వకారణం' అంటూ మొదటిపేజీలో రాసిన వ్యాసం బావుంది. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితులకు తగ్గట్టుగానే ఆ వ్యాసం ఉంది. అదే పేజీలో 'ప్రజాస్వామ్య పాలనకి సూచిక, అవిస్మృతమైన అధునాతన వేదిక' అనే వ్యాసం ఎంతో నచ్చింది. భారతదేశ పౌరులందరూ గర్వించే విధంగా కొత్త పార్లమెంట్ భవనం రావడం ఒక అద్భుతం. 'ఈ సౌధం ఏ ప్రధాని మోడీదో, భారతీయ జనతాపార్టీదో కాదు. దేశప్రజలది'.. అనడం గొప్ప మాట. 4వ పేజీలో కొత్తగా వచ్చిన 'అబ్బయ్యా!.. ఇదీ మందల' నవ్వుతెప్పిస్తోంది. నెల్లూరు యాస బాగుంది. లాయర్‌లో ఇలాంటి మంచి వ్యాసాలు, విశ్లేషణలు వస్తుండడం 'లాయర్' పాఠకునిగా నేను సంతోషపడుతున్నాను.

**- కె.వి.వి రాజు, కోవూరు.**

# పిల్లలకు పుస్తకపఠనంపై ఆసక్తి కలిగించాలి

రానురాను పుస్తకాలు చదవడానికి కూడా ఎవరికీ తీరిక ఉండడం లేదు. పొద్దస్తమానం ఫోన్లు చూసుకుంటూ కాలం గడిపేస్తున్నారు తల్లితండ్రులు. ఇక పిల్లలకి పుస్తకాలపై ఆసక్తి ఎలా కలుగుతుంది? ముందు పెద్దలు మారాలి. పిల్లలకు విసుగు లేకుండా విజ్ఞానాన్ని అందించేందుకు రోజూ కొంత సమయం కేటాయించాలి. చిన్నారులకు విజ్ఞానాన్ని, మానసిక వికాసాన్ని కలిగించే మంచి పుస్తకాలను తెచ్చి ఇవ్వాలి. వాటిని చదివించాలి. అందులోనూ ఇప్పుడు వేసవి కాలం సెలవులు కనుక, పిల్లల్లో ఉత్సాహాన్ని కలిగించేలా కథల పుస్తకాలు కూడా చదివించి, వాటిలో ఉన్న నీతిని తెలియజెప్పాలి. సరస్వతీ నిలయాలైన గ్రంథాలయాలకు పిల్లలను తీసుకువెళ్ళి వారికి లైబ్రరీల పట్ల అవగాహన కలిగించాలి. అలా ఈ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా చిన్నారుల భవితకు బాటలు వేయాలి.

**- ఎస్.ఆర్ మస్తానమ్మ, ఇనమడుగు**

# వెలకట్టలేనిది.. డాక్టర్ ప్రేమ్ దాతృత్వం

## • నిడిగుంటపాళెంలో ప్రారంభమైన ఉచిత కంటివైద్యశిబిరం

వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాలెం గ్రామస్థులకు కంటికి సంబంధించిన సమస్యల నుంచి విముక్తి కల్పించి స్పష్టమైన, మెరుగైన కంటిచూపు అందించాలనే లక్ష్యంతో అమెరికాలో ఉన్న మన నెల్లూరీయులు, ప్రపంచ ప్రఖ్యాతి పొందిన డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి కుటుంబ దాతృత్వంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పొర శస్త్ర చికిత్స వైద్య శిబిరం నిడిగుంటపాళెంలో ఈనెల 4న ప్రారంభమైంది. ఈనెల 11వ తేది వరకు జరిగే ఈ ఉచిత వైద్య శిబిరంలో ఇప్పటికే ఎంతోమంది గ్రామస్తులు వైద్యపరీక్షలు చేయించుకుని కంటిచూపుకు సంబంధించిన సమస్యల నుంచి బయట పడుతున్నారు. ఈ ఉచిత వైద్యశిబిరాన్ని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో శంకర్ నేత్రాలయం-చెన్నై, డా. ప్రేమసాగర్‌రెడ్డి కుటుంబం వారి సహాయ సహకారాలతో ఏర్పాటుచేసిన ఉచిత కంటి పొర చికిత్స వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు.



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మాతృభూమికి సేవ చేసేందుకు పరితపిస్తున్న నిడిగుంటపాలెం నివాసి, అమెరికాలో స్థిరపడిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి కుటుంబం పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆయన ఇక్కడ జన్మించడం ఈ గ్రామస్తుల అదృష్టమని మంత్రి కొనియాడారు. అత్యాధునిక టెక్నాలజీతో ఎటువంటి కుట్లు, ఇంజక్షన్లు వేయకుండా, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పూర్తి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలను నిడిగుంటపాలెంలోనే చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు.

నిడిగుంటపాలెంతోపాటు సమీప గ్రామాల ప్రజలందరూ వారం రోజులపాటు జరిగే ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్ష చేయించుకుని, అవసరమైతే శస్త్ర చికిత్సలు చేయించుకోవాలని, అందుకు ప్రేమ్‌సాగర్ రెడ్డి కుటుంబ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారని మంత్రి చెప్పారు. గ్రామంలో ఆర్వో ప్లాంట్లు, డ్రైన్లు, సిమెంట్ రోడ్లు, ఎన్నో వైద్య శిబిరాలు.. ఇలా అనేక రకాలుగా వసతులు కల్పిస్తూ, తమ గ్రామాభివృద్ధి కోసం లక్షలాది రూపాయలను డాక్టర్ ప్రేమ్ వితరణగా అందజేస్తున్నారని, సొంత గ్రామానికి సేవ చేస్తున్న ప్రేమ్‌సాగర్‌రెడ్డి దాతృత్వం వెలకట్టలేనిదన్నారు మంత్రి. కంటి సమస్యలను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అనంతరం కంటి శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన రెండు మొబైల్ ఐ సర్జికల్ యూనిట్లను మంత్రి కాకాణి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్ సాగర్‌రెడ్డి కుటుంబసభ్యులతో పాటు శ్రీహరిరెడ్డి, రవీంద్రారెడ్డి, శంకర్ నేత్రాలయ అడ్మిన్ డాక్టర్ అరుణ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.






## '75వేల గడపలు'...
# పూర్తిచేసిన కోవూరు ఎమ్మెల్యే

### ప్రజల ఆదరణ అపూర్వమన్న ప్రసన్న

**రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని తూచ తప్పకుండా అమలుచేయడంలో తనకు తనే సాటి అనిపించుకున్నారు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి.**

తొలినుంచి ప్రజాక్షేత్రంలో ఉండడం, ప్రజల సమస్యల పట్ల వెంటనే స్పందించడం, బాధితులను ఆదుకోవడం వంటి కార్యక్రమాలంటే ఆయనకెంతో ఇష్టం. అందుకు తగ్గట్టుగా ప్రజల్లోనే ఉంటూ ప్రజల బాధలు తీర్చడంలో తమ పార్టీ నేతలు ముందుండాలని ముఖ్యమంత్రి జగన్ సూచించడంతో ఎమ్మెల్యే ప్రసన్నకు అది ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. అందుకే గడపగడపకు మన ప్రభుత్వంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. ఈనెల 6వ తేది నాటికి 75 వేల గడపలు తిరగడం పూర్తిచేసన సందర్భంగా కొడవలూరు మండలంలోని గండవరంలో విజయోత్సవం నిర్వహించారు. ఉదయకళేశ్వరస్వామి సన్నిధిలో కేకు కట్‌చేసి సంబరాలుచేసుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరూ తమను ఇంటిబిడ్డగా ఆదరిస్తున్నారని, వారి ఆదరణ అపూర్వమని, వారి ఆశీస్సులతోనే ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నామని తెలిపారు.

డిసిఎంఎస్, డిఏఏబి ఛైర్మెన్‌లు వీరి చలపతి రావు, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ ఛైర్మెన్ గొల్లపల్లి విజయకుమార్, నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, వైకాపా మండల కన్వీనర్లు గంధం వెంకటశేషయ్య, మావులూరు శ్రీనివాసులురెడ్డి, బెజవాడ గోవర్థన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు

సమగ్ర సమాచార వారధిగా
ఎన్నో సంచలనాలకు సారధిగా
విశ్వవ్యాప్తంగా ఉన్న నెల్లూరీయులను
వారం వారం పలుకరిస్తూ...

42

వసంతాలు పూర్తి చేసుకుని
జిల్లా పత్రికా ప్రపంచంలో
తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని పొందిన
లాయర్
పత్రికకి
వార్షికోత్సవ అభినందనలు.

SMD HOMES
Value beyond Bricks
Bangalore | Tirupathi | Nellore

# నెల్లూరొస్తున్న వెంకయ్య

## జిల్లాలో 4 రోజుల మకాం



భారత 13వ ఉపరాష్ట్రపతి, మన నెల్లూరీయుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఆయన నెల్లూరు చేరుకుంటారు. 11న కుటుంబ సమేతంగా నర్రవాడకు వెళ్లి శ్రీ వెంగమాంబాదేవి తిరునాళ్ళలో పాల్గొని తిరిగివచ్చి రాత్రికి నెల్లూరులో బస చేస్తారు. 12వ తేదీ సోమవారం ఉదయం 10.50గంటలకు నెల్లూరులోని శ్రీ కస్తూరిదేవి విద్యాలయం ప్రాంగణంలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో కీ॥శే॥ మోపూరు వేణు గోపాలయ్య స్మృత్యంకంగా జరిగే 'గురువుకి వందనం' కార్యక్రమంలో పాల్గొని 'ప్రవచన సుధాకరుని వేణునాదం' అనే పేరుతో రూపొందించిన వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచికను ఆయన ఆవిష్కరిస్తారు. 13వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో పాల్గొంటారు. 14న నెల్లూరు నుండి హైదరాబాదుకు బయలుదేరి వెళతారు. వెంకయ్య నాలుగు రోజుల పర్యటనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# నేత్రపర్వంగా గంగమ్మతల్లి గ్రామోత్సవం



పడారుపల్లిలో వెలసి వున్న శ్రీ గంగమ్మతల్లి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి విశేష హోమాలు, అభిషేకాలు, విశిష్ట పూజలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా, ఈనెల 6న నిర్వహించిన అమ్మవారి గ్రామోత్సవం మరింత అట్టహాసంగా జరిగింది. సాయంత్రం దేవతామూర్తులకు అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. కుర్తాళం సిద్దేశ్వర పీఠం పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు జరుగుతున్నాయి. ఆలయ నిర్వాహకులు కాకుటూరు శ్రీహరితో పాటు గ్రామ పెద్దలు ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు.

# నెల్లూరు కబుర్లు




## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని, అది ప్రతిఒక్కరి బాధ్యత అని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, నెల్లూరు క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో నెల్లూరులోని నారాయణ నర్సింగ్ కాలేజ్‌లో ఈనెల 5న ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమ జిల్లా అటవీ అధికారి చంద్రశేఖర్, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ మాధవి, ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, నారాయణ డెంటల్ కాలేజ్ హెచ్ఓడీ కన్నన్, నారాయణ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. ఇందిర తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ దినోత్సవ ప్రతిజ్ఞను చేసి, కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. నారాయణ డెంటల్ కాలేజ్ హెచ్ఓడీ కన్నన్, నారాయణ నర్సింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 19న..నేతన్నల సమస్యలపై ధర్నాందోళన

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 19న నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నాందోళన చేపట్టనున్నామని జాతీయ చేనేత సంక్షేమ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి బూదాటి రాధయ్య చెప్పారు. ఈనెల 8న నెల్లూరులోని చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ అధ్వర్యంలో చేనేతల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. గాంధీనగర్‌లోని ఆప్కో స్థలాన్ని చేనేతలకే ఇవ్వాలని, చేనేతవస్త్రాలపై కేంద్రం విధించిన జిఎస్టీని తొలగించాలని వారు డిమాండ్ చేశారు. పముజుల అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, శుభకుమార్, చైతన్య, హరి, కోటేశ్వరరావు, బ్రహ్మయ్య, సుబ్రహ్మణ్యం, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా..

# శ్రీనివాసరావు



నెల్లూరు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖకు ఇటీవల కొత్త అసిస్టెంట్ కమిషనర్‌గా జంజనం శ్రీనివాసరావు నియమితులయ్యారు. నెల్లూరులో ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఈనెల 4న రాజ్యసభ సభ్యులు, నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు దేవాలయాల కార్యనిర్వహణాధికారులు అనేక దేవాలయాల ఈవోలు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆదాల చొరవతో..

# ఇరుకళలమ్మవారి ఆలయ సిబ్బందికి జీతాలు



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, నెల్లూరు రూరల్ వైకాపా ఇన్‌చార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు పెండింగ్‌లో ఉన్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సిబ్బంది జీతాలు ఇటీవల పూర్తిగా చెల్లించారు. నెల్లూరు గ్రామ దేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకులకు, సిబ్బందికి ఇవ్వవలసిన జీతాలు, మరికొన్ని బకాయిలు ఇవ్వకుండా గత 6 నెలలుగా వివిధ కారణాలవల్ల ఇదివరకటి కార్యనిర్వహణాధికారి బకాయిలు పెట్టిన మొత్తాన్ని ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), ఆలయ కొత్త కార్యనిర్వహణాధికారి బొగ్గల మల్లికార్జున్‌రెడ్డి సహకారంతో చెల్లించి సిబ్బంది అభినందనలు అందుకున్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు పల్లాల రాములమ్మ, కందుకూరు వెంకటేశ్వర్లు ఆచారి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 58వ భాగం




ఇంద్రప్రస్థం నగరంలో ఒకసారి బాగా వేడి వేడి గాలులు వీచి, మండుటెండలతో అట్టుడుకిపోయింది. దాన్ని తట్టుకోలేక కృష్ణార్జునులు ఖాండవ అరణ్యానికి విహారానికి వస్తారు. అప్పుడు బక్కచిక్కిపోయి అజీర్ణ రోగంతో బాధపడుతున్న అగ్నిదేవుడొచ్చి తన ఆకలి తీరటానికి తనకి ఆ అరణ్యాన్ని దహించటానికి సహాయం చేయమని దానికిగల కారణాన్ని చెపుతాడు.

పూర్వకాలంలో శ్వేతకి అనే మహారాజు చాలా యాగాలు చేయటం వలన అగ్నిదేవుడు ఆహుతులను భుజించి, మితిమీరిన నెయ్యి త్రాగి అజీర్ణం చేసుకుంటాడు. బ్రహ్మదేవుణ్ణి ప్రార్థించగా, ఖాండవ అరణ్యంలో దివ్య ఔషధాలు, వనమూలికలు తినమని, నరనారాయణులు మానవులుగా కృష్ణార్జునులు భూలోకంలో అవతరించారని వారి సాయం కోరమంటాడు. ఎందుకంటే, ఇంద్రుడు ఆ అడవిలో తన స్నేహితుడు, తక్షకుడనే విషసర్పాన్ని రక్షించటానికి అగ్నిదేవునికి అడ్డుపడుతుంటాడని, అగ్నిదేవుడు అర్జునునికి వరుణదేవునిచే గాండీవమనే కార్ముకం, అక్షయ తూణీరాలు, దివ్య రథం, గాలితో సమానంగా పరుగెత్తే అశ్వాలు, అలాగే శ్రీకృష్ణునికి సుదర్శన చక్రం, కౌముది అనే గద బహుకరిస్తాడు. అగ్నిదేవుడు వారి అంగీకారంతో ఖాండవ అరణ్య దహనం మొదలు పెడతాడు. ఆ మంటలకి చెట్లు, జీవరాశి దహనమయిపోతాయి. ఇంద్రుడికి తెలిసి మేఘాలతో వర్షం కురిపిస్తే, అర్జునుడు తన బాణ సమూహంతో ఆకాశంలో పంజరం లాగ వేస్తాడు. తప్పించుకుని పారిపోతున్న తక్షకుడి తల్లిని ఒక బాణంతో సంహరిస్తాడు అర్జునుడు. కానీ ఇంద్రుడు మాయ చేసి తక్షకుడి కొడుకుని రక్షిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






# గ్రోసు గోపాలయ్య పేరిట.. విద్యార్థులకు నగదు పురస్కారాలు



నెల్లూరు మురళీకృష్ణ హోటల్స్ అధినేత స్వర్గీయ గ్రోసు గోపాలయ్య పేరుతో వారి తనయుడు, అఖిల భారత గాండ్ల-తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు ఆధ్వర్యంలో ఈనెల 4న నెల్లూరులో ఆ సంఘం రాష్ట్రస్థాయి సమావేశం పెద్దఎత్తున జరిగింది. స్థానిక దేవిశెట్టి స్వాముల కల్యాణమండపంలో జరిగిన ఈ సమావేశంలో ఇటీవల టెన్త్, ఇంటర్‌లలో అత్యధికమార్కులు సాధించిన గాండ్ల సామాజికవర్గానికి చెందిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా తన సొంతనిధులతో బంగారుపతకాలు, నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేసి అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఉత్తమ మార్కులు సాధించిన గాండ్ల తెలికుల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో గ్రోసు సుబ్బారావు మాట్లాడుతూ, ఆర్థికంగా సామాజికంగా విద్యాపరంగా అన్నివిధాలా వెనుకబడిన గాండ్ల తెలికుల కులస్తుల సంక్షేమం ధ్యేయంగా తమ సంఘం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, కార్యనిర్వాహక అధ్యక్షులు నరవ అనంతం, కోశాధికారి నాగరాజు, నాయకులు దాడి సత్యనారాయణ, గాండ్ల తెలికుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఎస్ భవానిప్రియ, వీరవెంకటరాజు పాల్గొన్నారు.

# సినీరచయిత రాజేంద్రకుమార్‌కు డాక్టరేట్

నెల్లూరుకు చెందిన ప్రముఖ సినీరచయిత, వీఆర్‌కళాశాల పూర్వవిద్యార్థి పైడిపాటి రాజేంద్రకుమార్ ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం (హైదరాబాద్) నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'ప్రపంచీకరణ నేపథ్యంలో కార్మికుల హక్కులు' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించడం విశేషం. రాజేంద్రకుమార్ సినీ సంభాషణల రచయితగా మంచిపేరు సంపాదించారు. హిట్లర్, ఖుషీ, క్షేమంగా వెళ్లి లాభంగా రండి'.. తదితర 70 సినిమాలకుపైగానే మాటలు రాశారు. డాక్టరేట్ వచ్చిన సందర్భంగా మిత్రులు, సహచరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


# ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రం



ఉదయగిరి వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఈనెల 5న పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. పసుపు పంటకు క్వింటాలుకు 6,850 రూపాయల వంతున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని, ఈనెల 12వ తేది వరకు రైతుల వద్ద నుంచి పసుపు కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు మండలాలకు చెందిన 280 మంది రైతులు ఇ-క్రాప్ ద్వారా 180 ఎకరాల పంటను నమోదు చేసుకుని ఉన్నారన్నారు. ఒక్కో రైతు వద్ద నుంచి 30 క్వింటాళ్ళ వంతున, మొత్తం ఈ కొనుగోలు కేంద్రం పరిధిలో సుమారు 540 మెట్రిక్ టన్నుల పసుపు కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో వింజమూరు ఉద్యానశాఖ అధికారి షేక్ షకీల్, కొట్టాలపల్లి సొసైటీ ఛైర్మెన్ కల్లూరి రమణారెడ్డి, కాకు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# సోమిరెడ్డి కుటుంబసభ్యుల ఔదార్యం

## అనాధ చిన్నారులకు రూ.50వేల సాయం



తల్లితండ్రులను కోల్పోయి అనాధలుగా మిగిలిన ఇద్దరు చిన్నారులను మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమారుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన సతీమణి శృతి మానవతా దృక్పథంతో ఆదుకుని, వారికి తామున్నామంటూ భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఆ పిల్లల చదువులకు అయ్యే ఖర్చును కూడా భరిస్తామన్నారు. వివరాలిలా ఉన్నాయి. అనంతసాగరం మండలంలోని మినగల్లు ఎస్సీకాలనీకి చెందిన వెంకటేశ్వర్లు-పెంచలరత్నమ్మలు ఇటీవల మరణించడంతో వారి పిల్లలు రెండేళ్ల చిన్నారి అనుశ్రీ, ఏడునెలల పసివాడు అనాధలయ్యారు. ఆ సమాచారం తెలుసుకున్న సోమిరెడ్డి తనయుడు-కోడలు ఈనెల 4న మినగల్లుకు వెళ్ళి ఆ పిల్లలను ఆత్మీయంగా పలకరించారు. సోమిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారికి తక్షణ సాయం కింద 50వేల రూపాయల చెక్కును ఆ పిల్లల నానమ్మకు అందజేశారు. దుస్తులు, బొమ్మలు ఇచ్చి ఆత్మీయంగా పలకరించారు. ఈ అనాధ చిన్నారుల విషయాన్ని తమ తండ్రి ద్వారా విని, ఆయన సూచనల మేరకు ఆ చిన్నారుల భవిష్యత్తుకు అవసరమైన సాయం అందించేందుకు సంకల్పించామని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు గూటూరు మురళీ కన్నబాబు, దావా పెంచలరావు, రాపూరు సుందరరామరెడ్డి, రాపూరు జనార్ధన్‌రెడ్డి, చల్లా నరసారెడ్డి, ప్రసాద్‌నాయుడు, సాంబయ్య, తారక్, కాసా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. దీంతో ఆ మండల పార్టీ నాయకులు పాతపాటి మధుసూదన్‌రెడ్డి, వెంకటసుబ్బానాయుడు, అబ్బూరి రమేష్‌నాయుడులు కూడా స్పందించి ఆ పిల్లలకు 5వేల రూపాయల వంతున ఆర్థిక సాయం అందజేశారు.

# ఒక్కరోజులోనే 11 రకాల సర్టిఫికెట్లు

## ప్రయోగాత్మకంగా పిడూరులో ఏర్పాట్లు

ప్రజల సౌలభ్యం కోసం వారికి అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఒకరోజులో మంజూరుచేసేవిధంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జిల్లాలో అందుకు తొలి ప్రయోగాత్మక ప్రాజెక్టును పిడూరు గ్రామంలో ఏర్పాటుచేసింది. డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి పిడూరులో ఈనెల 4న ఏర్పాటుచేసిన సమావేశంలో ఆ వివరాలను తెలియజేశారు. పిడూరు గ్రామంలోని గ్రామ వార్డు సచివాలయం ద్వారా కులం, ఆదాయం, వివాహం, జనన-మరణ సర్టిఫికెట్ల వంటి 11 రకాల సర్టిఫికెట్లను ఒకరోజులో ఇచ్చేందుకు ఏర్పాటు జరిగాయని, వలంటీర్లు ఎవరికి ఏ సర్టిఫికెట్లు కావాలో గుర్తించి, వాటి మంజూరుకు అవసరమైన ఆధారాలు సేకరించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు, గ్రామపెద్దలతో కలసి సమావేశం నిర్వహించి ఆ అంశాలన్నీ వివరించారు. 'సిటిజన్ ఏపీ సేవ' కార్యక్రమం ద్వారా సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని, ఈ ప్రాజెక్టు విజయవంతమైతే జిల్లావ్యాప్తంగా త్వరలోనే అన్ని గ్రామాల్లో అమలుచేసేందుకు వీలుంటుందని ఆయన వివరించారు.

# కాపు విద్యార్థులకు ప్రోత్సాహకాలు

నెల్లూరులోని కాపుభవన్‌లో ఈనెల 4న కాపు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 38 మంది కాపు విద్యార్థులకు సుమారు లక్షా 6వేల రూపాయల మేరకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. విశ్రాంత తహశీల్దార్ ప్రసాద్, జానకిరామ్, శ్రీనివాస్, మల్లి, విజయకుమార్, రవి, లీలామాధవ్, అనిల్‌కుమార్, నాగేశ్వరి పాల్గొన్నారు.

## బంగారుచీరలో మెరిసిపోయిన..

# ముత్యాలమ్మ అమ్మవారు



పౌర్ణమి శుభ దినాన్ని పురస్కరించుకుని జూన్ 4 ఆదివారం రోజున చిల్లకూరు మండలంలోని ప్రముఖ గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ఆలయ అర్చకులు బంగారుచీరను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఏటా ఆనవాయితీగా వస్తున్న ఈ అలంకారంతో అమ్మవారు శోభాయమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని బంగారు చీరలో మెరిసిపోతున్న అమ్మవారిని కన్నులారా దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఇఓ నవీన్‌కుమార్, ట్రస్ట్‌బోర్డు ఛైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది.

## జొన్నవాడ కామాక్షమ్మను

# దర్శించుకున్న కలెక్టర్



జిల్లా కలెక్టర్ హరినారాయణన్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌లు ఈనెల 4న జిల్లాలోని సుప్రసిద్ధమైన జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతించగా, అర్చకులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటాలను బహూకరించి ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఛైర్మెన్ సుబ్రహ్మణ్యం నాయుడు, ఇఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## దేవాంగ విద్యార్థులకు

# ప్రతిభా పురస్కారాలు



ఇటీవల టెన్త్, ఇంటర్‌లలో 90 శాతం పైగా మార్కులు సాధించిన 56 మంది విద్యార్థులకు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4న ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఉన్నత విద్యలు అభ్యసించి దేవాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మధిర ఈశ్వర్, పముజుల నాగేశ్వరరావు, సజ్జా సతీష్, పడాల చంద్రమోహన్, వెంకటసురేష్, అజయ్‌కుమార్, శంకరయ్య, నరేంద్ర, నరసింహస్వామి, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల కంటివెలుగు.. వెన్నెలకంటి రాఘవయ్య

## ● జయంతి సభలో వక్తలు



గిరిజనులకు, ప్రత్యేకించి యానాదులకు, మొత్తంగా అనాదిగా అట్టడుగున పడివున్న ఆదిమజాతి వారి అభ్యున్నతికి జీవితాంతం కృషిచేసిన ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు, సమాజసేవాభిలాషి స్వర్గీయ వెన్నెలకంటి రాఘవయ్య సేవలు చిరస్మరణీయమని పలువురు గిరిజన సంఘాల నాయకులు స్మరించుకున్నారు. జూన్ 4న వెన్నెలకంటి రాఘవయ్య 126వ జయంతి సందర్భంగా నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ఉన్న వెన్నెలకంటి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటిష్‌వారి కాలంలో ఎన్నో హింసలకు గురవుతున్న యానాదులు, గిరిజనులను రక్షిస్తూ, సెటియాక్ట్ రద్దుకోసం అలుపెరుగక పోరాటం సాగించిన వెన్నెలకంటి రాఘవయ్య గిరిజనుల కంటివెలుగు అని వారు కీర్తించారు. యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, జిల్లా శాఖ అధ్యక్షులు బూదూరు కేశవరామ్, నాయకులు శ్రీనివాసులు, మురళి, నారాయణ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

# శ్రీ రంగనాథుని దర్శించుకున్న శ్రీరంగం పీఠాధిపతి



శ్రీరంగంలోని పెరియాశ్రమ పీఠాధిపతి ఆండవన్ వరాహ మహాదేశికన్ ఈనెల 4న నెల్లూరుకు వచ్చి రంగనాయకులపేటలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆండాళాశ్రమ శాఖ సన్నిధిలో భగవత్ పీఠ కైంకర్య కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం రంగనాథస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న గోపురం వీధిలోని శ్రీ వేదాంత దేశికర్ దేవస్థానాన్ని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అర్చకులు, వేద పండితులు ఆయన్ను ఘనంగా స్వాగతించారు. శ్రీ రంగనాథస్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ శివకుమార్ ఆచారి, కార్యనిర్వాహణాధికారి వెంకటేశ్వర్లు, శ్రీ వేదాంత దేశికర్ దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ వరదరాజన్ తదితరులు పాల్గొన్నారు.

# గమళ్లపాళెం రోడ్డు కోసం.. గ్రామస్తుల ఆందోళన



జలదంకి పంచాయతీ పరిధిలోని గమళ్లపాళెం గ్రామానికి ఎంతోకాలంగా రోడ్డు సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ గ్రామస్తులు ఈనెల 5న ఆందోళన నిర్వహించారు. గ్రామస్తులు సుమారు వందమంది మండుటెండను కూడా లెక్కచేయక, పసిబిడ్డలతో సహా పాల్గొని దాదాపు 14 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేసి, కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద బైఠాయించారు. అనంతరం, ఆర్డీఓ శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గమళ్లపాళెంకు రోడ్డు వేస్తామంటూ నాయకులు ఎన్నోసార్లు హామీలిచ్చారని, టెండరు ప్రక్రియ పూర్తిచేశామని మూడేళ్లుగా చెప్తూనే ఉన్నారు తప్ప, రోడ్డు పని మాత్రం ప్రారంభం కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వచ్చినప్పుడైతే అసలు ఆ రోడ్డుమీద నడవలేకపోతున్నామన్నారు. ఇకనైనా ప్రభుత్వం సమస్యలు గమనించి వెంటనే గమళ్లపాళెంకు రోడ్డు వేయాలని మొరపెట్టుకున్నారు. గ్రామ వార్డు మెంబరు జంపాని శ్రీనివాసులు, గ్రామ ప్రముఖులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, కేతిరెడ్డి విష్ణుతేజ, బత్తిన మనోహర్, బాలకోటయ్యయాదవ్, ప్రవీణ్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఆర్డీఓ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఎట్టకేలకు ఆందోళన విరమించారు.

# హెల్త్ ఆఫీసర్ల కొత్త కార్యవర్గం

ఆయుష్మాన్ భారత్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ -నెల్లూరుజిల్లా శాఖకు కొత్త కార్యవర్గం ఎన్నికైంది. ఈనెల 4న స్థానిక దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో ఏపి ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఛైర్‌పర్సన్‌గా ఎస్.రెబెకా, కో-ఛైర్‌పర్సన్‌లుగా టి.సుమాంజలి, ఎం.జ్యోతి, కె.మౌనిక, కన్వీనర్‌గా జి.చంద్రమౌళి, కో-కన్వీనర్లుగా ఎస్‌డి అస్మదున్నీసా, హైజాక్, తేజసాయికుమార్, కోశాధికారిగా టి.తిరుమలయ్య ఎన్నికయ్యారు.

# శెభాష్!...పోలీసులూ!..

○ ఇళ్ళ తాళాలు పగులగొట్టి చోరీలు చేసే దొంగలు దొరికారు
○ ఏడుగురు అరెస్ట్..రూ.30.50 లక్షల సొత్తు స్వాధీనం

- జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి వెల్లడి



**వారంతా స్నేహితులు. నెల్లూరు నగరంలో చిన్నచిన్న పనులు చేసుకుంటూ బతుకుతుండేవారు. అయితే, దుర్వ్యసనాలకు బానిసలై, డబ్బు కోసం దొంగతనాలకు దిగారు. ప్రత్యేకించి, తాళాలు వేసి ఉన్న ఇళ్లను కనిపెట్టి, అదనుచూసి తాళాలు పగులగొట్టి నిర్భయంగా చోరీలు చేస్తూ అందినకాడికి దోచుకుపోవడం అలవాటు చేసుకున్నారు. గత కొంతకాలంగా జిల్లాను వరుసచోరీలతో హడలెత్తిస్తూ, పోలీసులకు సవాల్‌గా మారిన ఈ దొంగలు ఎట్టకేలకు పోలీసులకు దొరికిపోయారు. నెల్లూరు రూరల్ పోలీసులు వలపన్ని ఈ దొంగలముఠాను పట్టుకుని అందరి అభినందనలు అందుకుంటున్నారు. జిల్లా ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి ఈనెల 5న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకర్లకు ఆ వివరాలను ఇలా వెల్లడించారు. వ్యసనాలకు బానిసలై, దొంగతనాలు చేయడమే పనిగా పెట్టుకుని, ఇళ్ళ తాళాలు పగులగొట్టి దొరికినదంతా ఊడ్చుకుపోతున్న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 30.50 లక్షల విలువచేసే బంగారు, వెండి వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.**

నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కర్తం అవినాష్, చల్లా నాగేంద్రబాబు అలియాస్ చిన్నోడు, నలజం సాయికృష్ణ, ముట్లూరు నరసింహులు అలియాస్ పిట్టోడు, ఏసీనగర్ నివాసి చెరుకూరు వంశీ అలియాస్ సరైనోడు, నవాబుపేటకు చెందిన దండు శేషగిరి అలియాస్ గిరి, తెలుగుగంగ కాలనీకి చెందిన గెండేటి పవన్‌కుమార్..ఈ ఏడుగురు స్నేహితులు. అవినాష్ పాత నేరస్తుడు. ఆటో నడుపుకుంటూ చోరీలకు కూడా పాల్పడేవాడు. వీరంతా ప్రతిరోజూ మద్యం సేవించే వారు. వ్యసనాలకు బానిసలై డబ్బు కోసం దొంగతనాలకు దిగారు. ఆటోలు, మోటార్‌బైక్‌లలో తిరుగుతూ ఇళ్లవద్ద కాపుకాసేవారు. ఎవరైనా ఇంటికి తాళం వేసివుంటే కనిపెట్టి, అదనుచూసి వచ్చి తాళాలు పగులగొట్టి దొంగతనం చేసేవారు. దొంగిలించిన సొమ్ము నంతా వాటాలు వేసుకుని పంచుకుని, జల్సాగా గడిపేవారు. ఈ నేపథ్యంలో గతనెల 22న గుడిపల్లిపాడు ప్రాంతంలోని కొండూరు శ్రీనివాసులు ఇంటి తాళం పగులగొట్టి ఆ ఇంట్లో ఉన్న 32సవర్ల బంగారు నగలు, 400 గ్రాముల వెండివస్తువులు దోచుకున్నారు. నెల్లూరు రూరల్ ఇన్స్‌పెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి చోరీ జరిగిన సంఘటనను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తుకు దిగారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగలెవరో గుర్తించారు. ఈ ఏడుగురు ఈ దొంగతనాలకు పాల్పడుతున్నారని నిర్ధారించుకుని వారిపై నిఘాపెట్టి, ఈనెల 5న నెల్లూరు జాతీయ రహదారి వద్ద వారిని అరెస్ట్ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిని తమదైన శైలిలో విచారించి, నిందితులు ఆ దొంగతనాలను చేసినట్లు నిర్ధారించారు. ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక కేసు, రూరల్ పరిధిలో 6 నేరాల్లో వీరి పాత్ర ఉందని గుర్తించారు. ఈ చోరీలకు ప్రధాన సూత్రధారి అయిన కర్తం అవినాష్‌పై ఇప్పటిదాకా 16 కేసులున్నాయని, బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉందని జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి చెప్పారు.

## పోలీసులకు ఎస్పీ రివార్డులు

ఇంతకాలంగా పోలీసుల కళ్ళుగప్పి తిరుగుతున్న ఏడుగురు నిందితులను శోధించి పట్టుకుని, వారి నుంచి 30.50 లక్షలు స్వాధీనం చేసుకున్న రూరల్ ఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ షేక్ సుభాని, క్రూస్‌టీమ్ ఎస్ఐ వి.బ్రహ్మయ్య, సిబ్బంది గిరిధర్‌రావు, జివి రమేష్, జి.గంగాధర్, బి.పెంచలప్రసాద్, నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఎస్.ప్రసాద్, జి.వేణుగోపాల్, షేక్ అల్లాభక్షు, జె.మునికృష్ణ, పి.శ్రీనివాసులు, పి.వినయ్‌కెఉమార్, పి.ప్రతాప్‌లను, హోంగార్డు కె.మనోజ్‌కుమార్‌ను జిల్లా ఎస్పీ అభినందించి వారికి రివార్డులు అందజేశారు. ఏఎస్పీ హిమవతి, రూరల్ డిఎస్పీ వీరాంజనేయరెడ్డి, సిఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెంగమాంబాదేవి ఆలయానికి

# రూ.14.85 లక్షలకు పైగా రాబడి



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో వెలసివున్న శ్రీ వెంగమాంబాదేవి పేరంటాలు అమ్మవారి దేవాలయంలో ఈనెల 5న హుండీలను లెక్కించారు. ఫిబ్రవరి 13 నుంచి జూన్ 5 వరకు, కేవలం 3 నెలలా 3 రోజులకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 14,85,551 రూపాయలు రాబడి వచ్చిందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఉషశ్రీ, ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, స్టేట్‌బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం తదితరులు పర్యవేక్షించారు.

## ఉపాధి పనుల్లో అక్రమాలు సహించం

జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, అలాంటి వారిపై కఠినచర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకట్రావు సిబ్బందిని హెచ్చరించారు. ఈనెల 5న ఆయన నెల్లూరులోని డ్వామా కార్యాలయం నుంచి పలు మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలను పెంచాలని, ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించాలని, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ కూలీల ఉపాధికి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు.

---

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



## వంతెన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు

గూడూరు పట్టణ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణం పనులను త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వరప్రసాదరావు తెలిపారు. పనులు పునఃప్రారంభించనున్న నేపథ్యంలో ఈ నెల 3వ తేదీ ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మలతో కలసి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14ఏళ్లుగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పునఃప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే ఈ బ్రిడ్జి పూర్తి చేసి ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, బత్తిన విజయకుమార్, నాశిన నాగులు, శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చర్చి వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ



చిల్లకూరు మండలం, తీపనూరు గ్రామంలో జరిగిన చర్చి 8వ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.యస్.జగన్ క్రిస్టియన్ సోదరుల పట్ల ప్రత్యేక ప్రేమ కలిగి ఉన్నారని, చర్చి వార్షికోత్సవానికి తనని ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం క్రిస్టియన్ సోదరులు మేరిగ మురళిని ఘనంగా సత్కరించారు.




## రౌడీషీటర్లపై నిరంతర నిఘా

డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

ఈ నెల 3వ తేదీ గూడూరులోని టూటౌన్ పోలీసుస్టేషన్లో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లుగా ఉన్న వారి పట్ల నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని, మద్యం సేవించి ఆగడాలు చేయడం, ఎక్కడైనా మితిమీరి ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకుని సామాజంలో మంచిగా జీవించాలని ఆయన హితవు పలికారు. మహిళల రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ స్కూళ్లు, కాలేజీలు, రైల్వేస్టేషన్, బస్టాండ్ల వద్ద నిరంతరం మఫ్టీలో సంచరిస్తూ ఉంటారని తెలిపారు. టూ టౌన్ సిఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## అధికారులతో ఆర్డీఓ సమీక్షా సమావేశం



గూడూరు రెవెన్యూ డివిజనల్ అధికారి యం.కిరణ్‌కుమార్ ఈ నెల 6న చిల్లకూరు, బాలయ్యపల్లి, వాకాడు, కోట తహశీల్దార్లు, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో సాగర్‌మాల ప్రాజెక్టు లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లింపు విషయంపై చర్చించి, భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. పేదలు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి తమ సమస్యలను వెళ్ళబుచ్చినప్పుడు తహశీల్దార్లు వెంటనే స్పందించి న్యాయంచేసే దిశగా ముందుకు సాగాలని సూచించారు.

## నెల్‌క్యాస్ట్ ఆవరణంలో మొక్కలు




ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో గూడూరు నెల్‌క్యాస్ట్ యూనిట్‌లో జరిగిన కార్యక్రమంలో ఏడవ అదనపు జిల్లా జడ్జి షేక్ షమ్మి పర్వీన్ సుల్తానా బేగం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 'నో ప్లాస్టిక్' నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. అనంతరం నెల్‌క్యాస్ట్ ఫ్యాక్టరీ ఆవరణంలో మొక్కలు నాటారు. అరవ పార్వతయ్య, మొహబూబ్ బాషా, వెంకటేష్, సయ్యద్ తాజుద్దీన్, నయోమి పాల్గొన్నారు.

## దివ్యాంగురాలికి ట్రై సైకిల్



జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో, కలిశెట్టి చెంచుకృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ దాతృత్వంతో గూడూరు టూటౌన్ కోర్టు సెంటర్ మసీదు ప్రక్కన నివాసం ఉంటున్న వంగలపూరు నాగలక్ష్మి అనే దివ్యాంగురాలికి మూడు చక్రాల సైకిల్‌ని పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మునిగిరీష్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక సైన్స్ సంస్థ అయినప్పటికీ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, రాధయ్య, కటకం శ్రీను, నక్కా గోపి, యస్.కె.సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఆనం'పై దాడి యత్నం.. దారుణం

## - మండిపడ్డ సోమిరెడ్డి, రామనారాయణరెడ్డి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డిపై కొందరు దుండగులు ఇటీవల దాడికి ప్రయత్నించడపై మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీమంత్రి–వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిలు మండిపడ్డారు. నెల్లూరులోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో ఉన్న కార్యాలయంలో ఈనెల 4న వెంకటరమణారెడ్డి తన పనులు ముగించుకుని అపార్ట్‌మెంట్‌లో కారు డోర్ తీసే సమయంలో ఒక్కసారిగా పదిమంది యువకులు నల్లటి డ్రెస్సుల్లో వచ్చి కర్రలు, రాడ్లతో దాడిచేసేందుకు సిద్ధమవుతుండడం గమనించిన వెంకటరమణారెడ్డి స్నేహితుడు సికిందర్‌రెడ్డి పెద్దగా కేకలు వేయడం, వెంటనే వెంకటరమణారెడ్డి తన చేతిలో ఉన్న వాటర్‌బాటిల్‌తో వారిని ఎదిరిస్తూ కేకలు పెట్టడంతో ఆ దుండగులు భయపడిపారిపోవడం జరిగాయి. ఈ ఘటనలో సికిందర్‌రెడ్డికి గాయాలు తగలడంతో ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందారు. దాడి సంఘటన తెలిసిన వెంటనే సోమిరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని అనేకమంది టిడిపి నాయకులు, ఇతర రాజకీయపార్టీల వారు కూడా ఈ దాడిని ఖండించారు.

### నెల్లూరులో రౌడీ రాజకీయాలు చెల్లవ్ - సోమిరెడ్డి



టిడిపి నాయకుడు ఆనం వెంకటరమణారెడ్డిపై దుండగుల దాడి దారుణమని, ఆయన వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఆయన ప్రాణాలను తీసేందుకు దుండగులను పంపారంటూ మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆనం వెంకటరమణారెడ్డిని, మనుబోలు సికిందర్‌రెడ్డిని పరామర్శించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 'ఆనం వెంకటరమణారెడ్డిపై దాడికి ఆ బ్యాచ్ ను పంపింది ఎవరు...వైసీపీ జిల్లా నాయకులా, రాష్ట్ర నేతలా, జిల్లా మంత్రా, ఎమ్మెల్యేలా'.. తేలాలన్నారు. వైకాపా దురాగతాలను ఎండగడుతున్నందుకే ఆనం వెంకటరమణారెడ్డిపై దాడికి యత్నించారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చినా పెద్దగా స్పందన లేదని, ఏసీ సుబ్బారెడ్డి మనవడిపై దాడి జరిగిందని పోలీసులకు సమాచారం అందిస్తే ఒక్క కానిస్టేబుల్‌ను పంపుతారా?..ఇదేనా మీ నిర్వాకం?.. అంటూ పోలీసుల తీరుపై ఆయన మండిపడ్డారు. నెల్లూరు జిల్లా రాజకీయ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా దాడుల సంస్కృతికి తెరలేపారని, ఇదెక్కడి పద్ధతని వైకాపా నాయకులపై ఆయన ధ్వజమెత్తారు. పాత రోజుల్లో ఫ్యాక్షన్ గొడవల్లో వాడే ఊటి కర్రలను నెల్లూరుకు తీసుకొచ్చి దాడులు చేయించడం వైసీపీ నేతల దుర్మార్గాలకు పరాకాష్ట అన్నారు. రాజకీయ చైతన్యానికి మారుపేరైన నెల్లూరులో రౌడీ రాజకీయాలు చెల్లవన్నారు. ఇలాంటి దుర్మార్గాలను సహించేదే లేదన్నారు. ఇలాంటి పిరికిపంద దాడులకు తెలుగుదేశం వారు భయపడరన్నారు. పోలీసులు నిష్పక్షపాత విచారణ జరిపి ఈ దాడి వెనుక అసలు సూత్రధారులెవరో తేల్చాలని, లేదంటే తాడోపేడో తేల్చుకుంటామన్నారు.




### ఇది రాజకీయ దాడే - ఆనం

ఆనం వెంకటరమణారెడ్డిపై జరిగిన దాడి రాజకీయపరమైనదేనని ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ప్రశాంతమైన నెల్లూరులో ఇలాంటి దాడులు దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను టిడిపి అధికార ప్రతినిధిగా వెంకటరమణారెడ్డి ప్రజలకు తెలియజేయడం ఆయన బాధ్యతని అంటూ, ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు నిర్లక్ష్యంగా ఉంటే ఇలాంటి రాజకీయ దాడులు స్ట్రీట్‌వార్‌లకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. ఈ దాడి నెల్లూరు రాజకీయ చరిత్రలో ఒక బ్లాక్ డేగా ఆయన అభివర్ణించారు. గతంలో ఉన్న రాజకీయనాయకులకు, రాజకీయ పరిజ్ఞానం లేని నేటి నాయకుల దిగజారుడు పనులు నచ్చడం లేదన్నారు. దాడికి సంబంధించి సిసి ఫుటేజీల్లో ఆధారాలున్నాయని, పరిశీలించి దాడికి పాల్పడిన వారిపై తగుచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పెద్దాసుపత్రిలో కలెక్టర్ తనిఖీలు

నెల్లూరు దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ సర్వజన వైద్యశాల (పెద్దాసుపత్రి)ను ఈనెల 7న జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ప్రసూతి భవనాన్ని, చిన్నపిల్లల వైద్యచికిత్సల భవనాన్ని సందర్శించారు. అక్కడున్న పిల్లల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. అనంతరం ప్రత్యేక నవజాత శిశు విభాగాన్ని సందర్శించి అక్కడ శిశువులకు అందచేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. చిన్న పిల్లలకు వైద్య సేవలందించడంలో వైద్యులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆయన సూచించారు. రోగులపట్ల అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సిద్ధానాయక్, ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటప్రసాద్, పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డా. జయచంద్రారెడ్డి, పెద్దాసుపత్రి అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ లక్ష్మీ సునంద తదితరులు పాల్గొన్నారు.



## పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో బిఎంఆర్

ఇటీవల ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో జరిగిన వ్యవసాయం, పశుసంవర్ధక మరియు మత్స్యశాఖల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో రాజ్యసభ సభ్యులు, మన నెల్లూరీయులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) పాల్గొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ మంత్రిత్వ శాఖలో ఉన్న వివిధ విభాగాలైన వ్యవసాయం మరియు రైతుల సంక్షేమం, వ్యవసాయ పరిశోధనా విభాగం, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, మత్స్యశాఖ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముందు రోజు రాత్రి న్యూఢిల్లీలో బిఎంఆర్ ఆధ్వర్యంలో స్టాండింగ్ కమిటీకి సమర్పించబోయే కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సవరణ) బిల్లు 2023 ముసాయిదాపై చర్చించారు. ఆల్ ఇండియా షింపు హేచరీస్ అసోసియేషన్, సొసైటీ ఆఫ్ ఆక్వా కల్చర్ ప్రొఫెషనల్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ, ఆంధ్రప్రదేశ్ నుండి ఆనందా గ్రూపు, తమిళనాడు నుండి జీకే హాచరీస్, ఒడిశా నుండి ఒడిస్సా స్టేట్ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మరియు పశ్చిమ బెంగాల్ నుండి ఎన్‌ఆర్‌జి సీడ్స్ మొదలగు ఆక్వా రంగంలోని సంస్థలు, ఆక్వారంగంలో నిపుణులైన డాక్టర్ రవిచంద్రన్, డాక్టర్ జయంతి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

'పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, నాడు ప్రతిపక్ష నాయకునిగా ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని' డిమాండ్ చేస్తూ ఈనెల 7న సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ధనరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వారం రోజుల లోపల ఎటువంటి షరతులు లేకుండా, కమిటీల కాలయాపన లేకుండా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించారని, అయితే ఇప్పుడు అందుకు భిన్నంగా మెరుగైన పెన్షన్ పేరుతో సిపిఎస్ విధానాన్ని అలాగే కొనసాగిస్తూ సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకుండా, తదుపరి క్యాబినెట్ సమావేశంలో సిపిఎస్ మీద మెరుగైన పెన్షన్ పేరుతో ప్రకటన చేయనున్నారని వస్తున్న సమాచారంతో సిపిఎస్ ఉద్యోగులందరూ ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న మూడు లక్షల సిపిఎస్ ఉద్యోగులను, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులను ఉద్యోగ విరమణ అనంతరం వారి ఆరోగ్య కుటుంబ సంరక్షణను దృష్టిలో ఉంచుకొని తగిన భరోసాను కలిగించాలని ఆయన కోరారు.










# రైతాంగానికి ఇది స్వర్ణ యుగం

## రైతుల ఖాతాలకు రూ. 6.57 కోట్ల సబ్సిడీ జమ

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి**



రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న తమ వైకాపా ప్రభుత్వ పరిపాలన రైతాంగానికి స్వర్ణ యుగమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల వెంకటాచలం మండలం చెముడుగుంట జడ్పీ హైస్కూల్‌లో వైఎస్ఆర్ యంత్ర సేవ పథకంలో భాగంగా రైతులకు ట్రాక్టర్లు, హార్వెస్టర్ల మెగా పంపిణీ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఎం హరినారాయణన్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఆ పథకం కింద జిల్లాలో రూ. 18.85 కోట్ల విలువైన 147 ట్రాక్టర్లు, రెండు వరి కోత యంత్రాలు, ఇతర వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, అర్హులైన రైతులందరికీ యంత్ర సేవా పథకం కింద ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలు, స్ప్రేయర్లు, డ్రోన్లు, టార్పాలిన్లు వంటి అనేక వ్యవసాయ పరికరాలను పెద్దఎత్తున క్రమం తప్పకుండా ముఖ్యమంత్రి అందజేస్తున్నారని చెప్పారు. ప్రతి విషయంలోనూ రైతుకు మేలు చేకూరేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. విత్తనం నాటిన దగ్గర్నుంచి పంట కోసే వరకు రైతు ముంగిటకే అన్ని సేవలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 14 నుంచి 15 లక్షల టన్నుల ధాన్యం అధికంగా ఉత్పత్తి అయిందని, ధాన్యం ధరలు కూడా బాగా పెరిగి అన్నదాతలు సంతోషంగా ఉన్నారని, రైతాంగానికి ఇది స్వర్ణయుగమని మంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రాజు, ఏడీలు అనిత, నర్సోజి రావు, ఎన్‌డిసిసి బ్యాంకు సీఈవో శంకర్ బాబు, డీసీఎంఎస్ ఛైర్మన్ వీరి చలపతి తదితరులు పాల్గొన్నారు.

### సిఎంకు అన్నదాతలు అండగా నిలవాలి - వేమిరెడ్డి

రైతులు కోరుకున్న ట్రాక్టర్లను వారికి అందించడం చాలా సంతోషంగా ఉందని, ఈ ఏడాది ధాన్యం ధరలు కూడా ఆశాజనకంగా ఉండి రైతులు విరివిగా ఎగుమతులు చేస్తూ లాభాలు ఆర్జించడం చాలా శుభపరిణామని, రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రికి అన్నదాతలు అండగా నిలవాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆయన పిలుపునిచ్చారు. పారదర్శకంగా పనిచేసే అధికారిగా గుర్తింపు పొందిన హరినారాయణన్ మన జిల్లాకు కలెక్టర్‌గా రావడం మనందరి అదృష్టమని, ప్రతి ఒక్కరూ తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళితే, పరిష్కార మార్గం చూపుతారని ఆయన రైతులకు సూచించారు.

# శ్రీసిటీలో.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**మియావాకి 5వ దశ చెట్ల పెంపకానికి శ్రీకారం**



పర్యావరణ హిత ప్రమాణాలతో పయనిస్తున్న శ్రీసిటీలో ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యవేడు అటవీశాఖ రేంజ్ అధికారి జి.జయప్రసాదరావు, ఇతర ప్రముఖులు స్థానిక ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసి)లో ప్రత్యేకంగా తలపెట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే అడవులు తరహా పచ్చదనాన్ని పెంపొందించే 'మియావాకి' పద్ధతి 5వ దశలో 56కుపైగా స్థానిక జాతులకు చెందిన దాదాపు 24,000 మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతోపాటు కార్యాచరణ రూపొందించేందుకు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీసిటీ చేపట్టిన హరితహిత చర్యలను అభినందించారు. అనంతరం శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక సందేశంలో.. 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్' (3ఆర్) విధానం పర్యావరణ పరిరక్షణకు ఎంతో అనువైనదంటూ, వివిధ హరిత కార్యక్రమాలపై దృష్టి సారించడంతో పాటు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'గ్రీన్ అండ్ క్లీన్' ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలను మమేకం చేస్తూ కమ్యూనిటీ ఉద్యానవన సాగు ప్రక్రియకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీ హార్టికల్చర్ ల్యాండ్‌స్కేపింగ్ విభాగం హెడ్ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో నోవా ఎయిర్ పరిశ్రమ సీనియర్ ప్లాంట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్, వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్, శ్రీసిటీ పర్యావరణ విభాగం హెడ్ డాక్టర్ వెంకట్, సెక్యూరిటీ, విజిలెన్స్ హెడ్ రమేష్ పాల్గొన్నారు.


**ఉచిత ఆన్‌లైన్ శిక్షణ**
క్రియా యోగ అన్ని వయస్సుల వారికి
పవర్ యోగా
క్రియా యోగ మరియు గర్భం దాల్చిన వారికి ధ్యానం
(తల్లి గర్భంలో ఉన్నప్పుడే శిశువును మహోన్నతమైన వ్యక్తిత్వంతో తీర్చిదిద్దడం)
పవర్ యోగా మరియు సంతానం కోసం ఎదురుచూసే దంపతులకు సంకల్ప ధ్యానం
(మహోన్నతమైన వ్యక్తిత్వం గల శిశువును స్వీకరించుట కొరకు)
విద్యార్థులకు ఉన్నతంగా రాణించడానికి
అద్భుత జ్ఞాపకశక్తి శిక్షణ మరియు చదివే పద్ధతులు
**యం. సనత్‌కుమార్‌రెడ్డి**
(ఉచిత ఆన్‌లైన్ యోగా, జ్ఞాపకశక్తి, చదివే పద్ధతులు ట్రైనర్)
పొదుపు పథకాలు (మ్యూచువల్ ఫండ్స్), ఆరోగ్య బీమా
జీవిత బీమా సలహాదారుడు
సెల్: 9441854387
3సి, ప్రీతి టవర్స్, మాగుంట లే-అవుట్, లెక్చరర్స్ కాలనీ దగ్గర, నెల్లూరు. ఆం.ప్ర.




# సిఎం నిర్ణయాలు సముచితం

**—ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి**

నెల్లూరు మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక –4 స్టాక్ పాయింట్‌ను ఇటీవల ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి సందర్శించి, విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఎనిమిది రకాల విద్యాపరికరాలను, ఇతర వస్తువులను పరిశీలించారు. నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా ప్రభుత్వం పథకాలు ప్రవేశపెట్టి, వీటిని బడి తెరిచిన మొదటి రోజే పంపిణీ చేసి విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల ముఖంలో కూడా ఆనందం చూసే విధంగా ముఖ్యమంత్రి నిర్ణయాలు చాలా అభినందనీయమని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి కొనియాడారు. ఒక తరం మారితే సమాజంలో సంచలనాత్మకమైన మార్పులు తీసుకుని రావచ్చనే దృఢ సంకల్పంతోటి పథకాలు ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉషారాణి,మరియు మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గోశాలను ప్రారంభించిన చిన్నజియర్‌స్వామి



నేటి ఆధునిక యుగంలో మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ, సర్వ మానవాళి శ్రేయస్సుకు పరమ పూజ్యులు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి చేస్తున్న కృషి అమోఘమని రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 5వ తేది ఉదయం అనంతసాగరం మండలం సోమశిలలోని పరమానంద ఆశ్రమ సమీపంలో నూతనంగా నిర్మించిన గోశాలను శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి వారి దివ్య మంగళా శాసనములతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మానవాళి ప్రయోజనాలే లక్ష్యంగా ఆయన ప్రవచనాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. హైదరాబాదులో సమతామూర్తి రామానుజన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సాధారణ విషయం కాదని, సుమారు 1000 కోట్లతో ఈ ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత చినజీయర్ స్వామికే దక్కిందన్నారు. జీయర్ స్వామి ఆధ్వర్యంలో పరమానంద స్వామి మఠం పనిచేయడం సంతోషకరమని, ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు కూడా చేపడుతున్నట్లు మంత్రి చెప్పారు. తొలుత సోమశిలలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కుటుంబసభ్యులతో కలిసి మంత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొనగా, పూర్ణ కుంభ స్వాగతం పలికిన అర్చకస్వాములు వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో గోశాల నిర్మాణ దాతలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన ఎన్‌సిసి కేడెట్లు



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని 10-ఆంధ్ర నావల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు కమాండర్, కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ వినయ్ రామచంద్రన్ సారథ్యంలో ఈనెల 5న కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెంలో కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామచంద్రన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కుమార్‌బాబు, సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, గొలగమూడిలోని మహాత్మా జ్యోతిరావు పూలే మత్స్యకార బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దమ్ము కొండలరావు తదితరులు మొక్కలు నాటారు. తొలుత ఇటీవల ఒడిశాలో రైలు ప్రమాదంలో మరణించిన వారికి నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కొరకై ప్రతిజ్ఞ చేశారు. కొత్తూరు అటవీ ప్రాంతంలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో కేడెట్లకు ఫైరింగ్ శిక్షణను, ఎన్‌సిసి అధికారి కాసల మస్తానయ్య నేతృత్వంలో హవల్దార్ బ్రిజ్‌పాల్ సింగ్, అనీల్ శర్మ శిక్షణ నిచ్చారు. అధికారులు ఎస్‌కె ఖాదర్ బాషా, సి.వి.నాగరాజు, ఎస్.విద్యాసాగర్, ఎన్‌సిసి స్టాఫ్ సూరజ్ బగేల్, వెంకటేష్ రాథోడ్, నీలేష్, అరుణ్ శర్మ, రామన్ తదితరులు పాల్గొన్నారు.

# బాలు పాటలు ఆణిముత్యాలు

**- సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి**



ప్రఖ్యాత సినీ గాయకుడు, గాన గంధర్వుడు స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన ప్రతిపాట ఒక ఆణి ముత్యమేనని, తెలుగులోనే కాక పలు భారతీయ భాషల్లో కూడా ఆయన పాడిన వేలాది పాటలు అశేష ప్రేక్షకజనాన్ని ఆకట్టుకున్నాయని నెల్లూరు నగరంలోని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీతం పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి అన్నారు. జూన్ 4న ఎస్పి బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి వేడుకలు ఈ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి బాలుకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలుగు చలనచిత్ర పరిశ్రమలో బాలు యుగం స్వర్ణ యుగమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సాయిబాబా, పినాకపాణి, మల్లికార్జున, తిరుపతమ్మ, కుమారి వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ వాతావరణ దినోత్సవంపై..
# అవగాహన ర్యాలీ




ప్రపంచ వాతావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 4న నెల్లూరులో నెహ్రూ యువకేంద్ర మరియు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ వద్ద ఉన్న స్వతంత్ర పార్కు నుండి విఆర్సి కూడలి వరకు జరిగిన ఈ ర్యాలీలో ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ పరావస్తు నాగసాయి సూరి మాట్లాడుతూ, ప్రపంచ వాతావరణ దినోత్సవంపై స్థానిక ప్రజలకు అవగాహన కలిగించారు. ఐక్యరాజ్య సమితి 1972లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించిందని, వాతావరణ పరిరక్షణకు సంబంధించి బృహత్ కార్యంగా అది రూపుదిద్దుకున్నదని చెప్పారు. ఈ దినోత్సవం సందర్భంగా మన చుట్టుపక్కల పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం, ఆహార పదార్థాల దుబారాను అరికట్టడం, ప్లాస్టిక్ బ్యాగుల నిషేధం, మొక్కలు నాటడం, వ్యర్థాలను పునర్వినియోగంలోకి తీసుకురావడం వంటి నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, విశ్రాంత లేబర్ కమిషనర్ రాచపాలెం రఘు, గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరవ రాయప్ప, డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి, అనురాధ, యోగా మాస్టర్ రవీంద్ర, అందే శ్రీనివాసులు, పి.వి. రెడ్డి, లక్ష్మీనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ప్లానింగ్ విభాగానికి.. కొత్త డీసీపీ

నెల్లూరు నగర కార్పొరేషన్ ప్లానింగ్ విభాగానికి కొత్త డీసీపీగా దేవకుమారి నియమితులయ్యారు. ఆ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. అనంతపురం కార్పొరేషన్ కార్యాలయంలో డీసీపీగా పనిచేస్తున్న ఆమెను నెల్లూరుకు బదిలీ చేశారు. జూన్ 3న ఆమె ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

## రవాణాశాఖలో బదిలీలు

నెల్లూరులోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న వంశీ ఇటీవల గుంటూరు కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో గుంటూరు ఉప రవాణా కమిషనర్ వారి కార్యాలయం నుండి సత్యక్రాంతి బదిలీ అయి నెల్లూరులో బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా, నెల్లూరులోని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఒంగోలు కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఒంగోలు కార్యాలయం నుండి కృష్ణయ్యను నెల్లూరులో నియమించారు.

# అర్హులైన పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్లు

**- జిల్లా కలెక్టర్ హరినారాయణన్**



జిల్లాలో ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధ్యక్షతన ఇటీవల జరిగిన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశం నిర్ణయం తీసుకుంది. కలెక్టర్ చాంబర్లో జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం డాక్యుమెంట్లు సమర్పించిన అన్ని పెద్ద తరహా పత్రికలు, మీడియా ఛానళ్ళకు, వెటరన్ జర్నలిస్టులకు అర్హత మేరకు అక్రిడిటేషన్లను మంజూరు చేస్తున్నామన్నారు. చిన్న పత్రికలు, పీరియాడికల్స్‌కు అర్హతమేరకు అక్రిడిటేషన్లు మంజూరు చెయ్యాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. రెగ్యులారిటీతో పాటు నిబంధనల ప్రకారం ప్రచురితమవుతున్న చిన్న పత్రికలను పరిశీలించి మాత్రమే అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని ఆయన సూచించారు. త్వరలో మరో సమావేశం కూడా ఏర్పాటు చేస్తామని, ఇంకా అర్హులైనవారు ఉంటే వారికి కూడా నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామన్నారు. కమిటీ సభ్యులు చేసిన సూచనలను కమిషనర్‌కు పంపవలసినదిగా కమిటీ కన్వీనర్ సదారావుకు సూచించారు. అక్రిడేషన్ కమిటీ సభ్యులు మస్తాన్‌రెడ్డి (సాక్షి), వెంకటేశ్వర్లు (ఆంధ్రప్రభ), కోటేశ్వరరావు, వీడియో జర్నలిస్ట్ ప్రసాద్, కెమెరామన్ మాల్యాద్రి, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా కార్మికశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డివిఎం చిరంజీవి, హౌసింగ్ పీడీ, పిఆర్వోలు రమేష్, రవీంద్ర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినతేదీ ధృవీకరణ..ఇక సులభం

జిల్లాలో సుమారు పాతికేవేల మంది చిన్నారులు పుట్టినతేదీ ధృవీకరణ జరగలేదని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హరినారాయణన్ చొరవ తీసుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో ఇక ఆ ధృవీకరణ మరింత సులభతరం కానుంది. పుట్టినతేదీ సర్టిఫికెట్లు (బర్త్ సర్టిఫికెట్లు) ఎలా పొందాలో అవగాహన లేని ఎంతోమంది చిన్నారుల తల్లితండ్రులకు ఈ పద్ధతి వల్ల ఎంతో వెసులుబాటు కలుగుతుంది. అంగన్‌వాడీ మహిళాపోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంల సమన్వయంతో పుట్టినతేదీ ధృవీకరణ లేని చిన్నారులను గుర్తించి, వారికి ధృవీకరణ పత్రాలు ఇప్పించేలా కలెక్టర్ ఆదేశించినట్లు కావలి డిఎల్‌డిఒ కనక దుర్గాభవాని తెలిపారు. చిన్నారులు ఒకవేళ ప్రభుత్వ వైద్యశాలల్లో జన్మించివుంటే వారికి వైద్యశాలలో నమోదైన పత్రాలు, తల్లితండ్రుల ఆధార్ కార్డులు తీసుకుని వారి వివరాలు నమోదుచేసుకోవాలని కలెక్టర్ సూచించారని ఆమె వివరించారు.

# కాలుజారి కాలువలో పడిపోయారు

- ఇద్దరు బాలికల దుర్మరణం
- చింతలపాలెంలో విషాదం


లతీష


అక్షిత

తల్లితండ్రులకు సాయంగా ఉంటుందని కాలువలో దుస్తులు ఉతకడానికి వెళ్ళిన ఇద్దరు బాలికలు ప్రమాదవశాత్తూ పట్టుతప్పి కాలుజారి కాలువలో పడిపోయి దుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటన ఈనెల 3న వెంకటాచలం మండలంలోని చింతలపాలెంలో జరిగింది. ఎంతో హుషారుగా ఉండే ఈ బాలికలు మరణించడంతో వారి కుటుంబసభ్యుల రోదన వర్ణనాతీతం. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతలపాళెం గ్రామానికి చెందిన కడివేటి పెంచలరత్నం కుమార్తె లతీష(13), శేషం అంకయ్య కుమార్తె అక్షిత ఇద్దరూ మంచి స్నేహితులు. దుస్తులు ఉతకడానికి కనుపూరుకాలువ వద్దకు వెళ్ళారు. నిండుగా ఉన్న కాలువలో పట్టుతప్పి పడిపోయారు. స్థానికులు గమనించి వారిద్దరినీ కాలువ నుంచి వెలికితీశారు. అప్పటికే కొనఊపిరితో ఉన్న ఆ బాలికలను వెంటనే ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. వారు మరణించడంతో స్థానికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హుటాహుటిన వెళ్ళి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల కుటుంబసభ్యులను ఓదార్చి, ప్రభుత్వం తరపున వారికి అండగా ఉంటామని చెప్పారు.

# నెల్లూరులో ఉచిత వైద్యశిబిరం

నెల్లూరులోని ఆర్టీఏ కార్యాలయం సమీపంలో ఉన్న 'సన్ క్లినిక్'లో ఈనెల 4న ఉచిత వైద్యశిబిరం నిర్వహించి సుమారు 150 మందికి వైద్యపరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సుప్రజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఆసుపత్రి ఎం.డి డాక్టర్ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



## శ్రీ రంగనాథస్వామికి..
## 9 నుంచి వసంతోత్సవాలు

నెల్లూరు రంగనాయకులపేటలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో జూన్ 9 నుంచి 11వ తేది వరకు వసంతోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారి వసంతోత్సవాల వైభవాన్ని కన్నులారాచూసి తరించాలని ఆలయ ఛైర్మన్ శివకుమార్ ఆచారి, ఇఒ డి.వెంకటేశ్వర్లు కోరారు.

## బోగోలులో విద్యాకానుకలు తనిఖీ

మండల కేంద్రమైన బోగోలు ఆర్ఎస్ఎం స్కూల్‌లో ఏర్పాటు చేసివున్న జగనన్న విద్యాకానుకల స్టాక్‌పాయింట్‌ను ఈనెల 5న పాఠశాలల ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు సుబ్బారావు (గుంటూరు) ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాకానుకల సరఫరా సరిగా జరిగిందా లేదా అని ఆరాతీశారు. ఆయన వెంట ఎంఇఒ జయంతిబాబు తదితరులున్నారు.

## కడనూతలలో మొక్కలు నాటిన విద్యార్థులు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5న బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ రహదారి పరిసరాల్లో మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పివిఎన్ రెడ్డి, ఏఓ ఆర్‌వి రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు ఏ.కిరణ్ కుమార్, వై.కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇనమడుగులో క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు

కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లోని క్షయ వ్యాధిగ్రస్తుల కోసం ఉద్యోగులు నిధులు సేకరించి వారికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈనెల 5న ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఉద్యోగులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు రవిబాబు చేతులమీదుగా సరుకులు పంపిణీచేశారు.

## ప్రతిభ చాటుకున్న వింజమూరు జడ్పీ విద్యార్థులు

వింజమూరు జడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు 20 మంది ఇటీవల జరిగిన ఎన్ఎంఎస్ టాలెంట్ పరీక్షకు ఎంపికై తమ ప్రతిభను చాటుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు వారి మాధ్యమిక విద్యను పూర్తి చేసేలా ప్రోత్సహించడానికి ఈ టాలెంట్ పరీక్ష ఉపయోగపడుతుంది. అందులో అర్హతపొందిన తమ విద్యార్థులను హెడ్మాస్టర్ మాలకొండరావు అభినందించారు.

## కొమరికలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

ఇందుకూరుపేట మండలంలోని కొమరిక గ్రామంలోని ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో 'ఫ్యామిలీ ఫిజిషియన్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో అనారోగ్యంతో ఉన్న వారి ఇళ్ళకు వెళ్ళి వైద్యం చేశారు. జ్వరాలతో బాధలుపడుతున్నవారికి ఉచితంగా మందులిచ్చారు. కొమరిక ఏఎన్ఎం పి.పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వావిళ్లలో గడ్డివామి దగ్ధం

విడవలూరు మండలంలోని వావిళ్ల గ్రామంలో ఈనెల 5న మడపర్తి గోపాల్‌కు చెందిన పదిహేనెకరాల గడ్డివామి ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదానికి గురైంది. మండుటెండలతో ఈ ప్రమాదం జరిగివుండవచ్చని భావిస్తున్నారు. దాదాపు 50 వేల రూపాయల గడ్డివామి తగలబడిపోయిందంటూ గోపాల్ విచారం వ్యక్తం చేశారు.

## జొన్నవాడలో.. మలేరియా వ్యాధి పట్ల అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ప్రజలకు ఈనెల 5న మలేరియా వ్యాధి పట్ల అవగాహన కలిగించారు. ఆరోగ్యకేంద్రం వైద్యులు అహమ్మద్‌బాషా మాట్లాడుతూ, ప్రజలు మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స చేయించుకోవాలని కోరారు. జూన్ 1 నుంచి 30వ తేది వరకు మలేరియా వ్యాధి నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

# అంధకారానికి అలంకారం

(మొదటి పేజీ తరువాయి)

ఇదే ఉద్దేశంతో నాలుగేళ్ళ కిందట ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో ఓ ప్రభుత్వానికి ప్రజలు అధికారం కట్టబెట్టారు. పేదల పక్షాన నిలబడి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని వాగ్దానం చేసిన జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అనేక మార్పులు వచ్చాయి. అన్న వస్తున్నాడని చెప్పండి, నేను విన్నాను – నేను ఉన్నాను అంటూ నవరత్నాలు వంటి అనేక నూతన పథకాలతో ప్రజల ముంగిటకు వచ్చిన ఆయన నాలుగేళ్ళ పాలనలో 98 శాతానికి పైగా వాగ్ధానాలను పూర్తి చేశామని ఘనంగా చెప్పుకుంటున్నారు. తప్పేం లేదు. ఎవరైనా ఇలానే చెబుతారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చోటు చేసుకున్న మార్పుల్లో సానుకూలమూ ఉన్నాయి, ప్రతి కూలమూ ఉన్నాయి. అయితే శాతాల్లో చూస్తే ప్రతికూలాలే ఎక్కువన్నది విశ్లేషకుల అభిప్రాయం. అంధకారంలో వున్న రాష్ట్రానికి అలంకారం చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారన్నది వారి భావన.

భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి మరింత ప్రత్యేకమైంది. తెలంగాణ రాష్ట్రం విడిపోయాక, అప్పటి వరకూ ప్రధాన ఆదాయవనరుగా ఉన్న హైదరాబాద్ మనకు దూరమైంది. ఈ పరిస్థితుల్లో ప్రతిదీ కొత్తగా సృష్టించుకోవలసి వచ్చింది. వచ్చిన ఆదాయాన్ని సర్దుకుంటూ ఓ మధ్యతరగతి ఉద్యోగిలా గడపాల్సిన పరిస్థితి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఏర్పడింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి నాళ్ళలో పరిస్థితి బాగానే ఉన్నా, కరోనా తర్వాత అన్నీ మారిపోయాయి. ఉద్యోగులకు నెల జీతాలు ఇవ్వాలంటే వెతుక్కోవలసిన దుస్థితి. రోడ్లు వెయ్యటానికి డబ్బులు లేవు. అభివృద్ధి కార్యక్రమాలకు డబ్బులు సరిపోవు. అప్పులు చేయటం లబ్ధిదారులకు డబ్బులు పంచటం, ఉద్యోగులకు జీతాలు ఆలస్యం చేయటం. ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇన్ని ఇబ్బదులు ఉన్నా బటన్ నొక్కడం మాత్రం ఆగడం లేదు. ప్రజల ఖాతాలలో నేరుగా డబ్బులేయడాన్ని అభివృద్ధి, సంక్షేమం అంటూ డప్పు కొట్టుకోవడం అంధకారానికి అలంకారం లాంటిదే నన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఇక మంత్రులు ఉన్నారంటే, వారు ఎందుకు ఉన్నారో బహుశా వారికైనా తెలుసో లేదో అర్థం కాదు. కేవలం ప్రతిపక్షాల మీద బురద చల్లడానికి , ప్రశ్నించిన వారిని కేసులతో వేధించడానికి మాత్రమే వారున్నారా అనే భావన కలిగేలా వారి తీరు కనపడుతోంది.

ప్రజలకి రాజుకి మధ్య నేరుగా సంబంధాలు లేవు. శత్రుదుర్భేద్యమైన భద్రత మధ్య సి. యం ప్రజల మధ్యకు వచ్చి వెళ్తున్నారు. ఆయన కోటకి, కోటరీకే పరిమితమైపోతున్నారన్న విమర్శ సర్వత్రా వినపడుతోంది. ఆయనతో నేరుగా పరిచయం ఉన్నవారికి కూడా ఆయనను కలిసే అవకాశం రావడం లేదు. ప్రశ్నించిన వారి మీద దాడులు, పొగిడిన వారికి అందలాలు సర్వసాధారణం అయ్యాయి. ఈ మధ్య మంత్రులు మొదలుకుని ఎమ్మెల్యే వరకూ ఇంటింటికీ తిరిగారు. వెళ్ళిన ప్రతిచోట ప్రజలు బాగానే ప్రశ్నించారు. డామిట్... కథ అడ్డం తిరిగింది అనుకున్నారో ఏమో... జగనన్నకు చెబుదాం అంటూ ఫోన్ ద్వారా తమ సమస్యలను వివరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేసి ఉంటే కనీసం ప్రజల నిజమైన సమస్యలేంటో తెలిసేవి. నాలుగేళ్ళ తర్వాత ఎన్నికల చివరి సంవత్సరంలో ప్రజలు గుర్తొచ్చారా ...? మరో వారం పది రోజుల్లో రుతుపవనాలు వచ్చి రాష్ట్రంలో వర్షాలు మొదలవుతాయని చెప్తున్న తరుణంలో పోలవరం సందర్శన మర్మం ఏమిటి ...? అనే మాటలు కూడా స్వంత పార్టీ శ్రేణులనుండే గట్టిగానే వినిపిస్తున్నాయి.

కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయ: ।
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ॥

భగవద్గీతలోని 3వ అధ్యాయం కర్మ యోగంలో శ్రీ కృష్ణుడు అర్జునుడికి చెప్పిన మాటలివి. తమ ధర్మాన్ని, విహిత కర్మలను నిర్వర్తించటం ద్వారానే జనక మహారాజు వంటి వారు సిద్ధిని పొందారు. కావున నీవు కూడా స్వార్థం వదలిపెట్టి లోక హితం కోసం కర్మలు నిర్వహించడానికి నీకు అర్హత ఉంది.

ప్రజాస్వామ్యంలో ఎన్నో చిక్కుముళ్ళు ఉంటాయి. ఎన్నికల సమయంలో ఎవరు గట్టి వాగ్దానాలు చేస్తారో వారు గెలవటం సర్వసాధారణమే. కొన్ని సార్లు పాత ప్రభుత్వాల మీద కోపం మరొకరికి అధికారాన్ని కట్టబెడితే, మరి కొన్ని సమయాల్లో కొత్త వారు ఏదో చేస్తారనే ఆశ వారికి అధికారాన్ని అందిస్తుంది. ఏదేమైనా ప్రజా తీర్పులో ఎలాంటి లోపమూ ఉండదు. తమకు ఆశపెట్టి గెలిచిన వారు ప్రజలకి ఏదో చేస్తారన్న ఒక చిన్న నమ్మకం. వైసీపీ విషయంలోనూ అదే జరుగుతోంది. తల తాకట్టు పెట్టి మరీ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారంటున్నారు విశ్లేషకులు. అయితే ఈ సమయంలో నిజమైన అభివృద్ధిని, సంక్షేమాన్ని, రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేస్తున్నారన్నది వారి ఆలోచన.

గ్రామ కార్యదర్శుల స్థాయిలో గృహాలకు సంబంధించి సెటిల్‌మెంట్ మొత్తాన్ని వసూలు చేయాలన్న ఒత్తిడి బాగా పెరుగుతోంది. ముఖ్యంగా నెలాఖరులో కార్యదర్శుల మీద ఈ ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. వారు దాన్ని ప్రజల మీద చూపిస్తున్నారు. నెలాఖరులో పెద్ద ఉద్యోగుల దగ్గరే డబ్బులు ఉండవు. ప్రభుత్వం నుంచి గృహాన్ని పొందిన పేదల దగ్గర డబ్బు ఎలా ఉంటుందనే చిన్న విషయాన్ని కూడా ప్రభుత్వ అధికారులు మరచిపోతున్నారు. దీని వల్ల కూడా ప్రభుత్వం మీద వ్యతిరేకత గుప్పుమంటోంది. ఇక కొంత మందికి పథకాలు తీసెయ్యటం కూడా చర్చకు దారి తీస్తోంది. ఇది ఒకందుకు మంచిదే అయినా, అవినీతి జరిగిన విషయాన్ని ప్రభుత్వం నేరుగా ఒప్పుకున్నట్లు అవుతోంది. ఇలాంటివి ముందుగానే గుర్తించి ఉంటే వ్యతిరేకత వచ్చి ఉండేది కాదు. పన్నుల విషయంలోనూ ప్రభుత్వ ధోరణి ప్రజల్లో వ్యతిరేకతకు కారణం అవుతోంది. దీనికి తోడు చోటా మోటా వైసీపీ కార్యకర్తలు చేస్తున్న హడావిడి కూడా ప్రజల ఏవగింపునకు కారణం అవుతోంది. ఇవన్నీ ప్రభుత్వం మీద ప్రతికూల ప్రభావానికి కారణం అవుతాయని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

జగన్‌మోహన్‌రెడ్డి యువకుడు. రాజకీయాల్లో ఆయనది చాలా చిన్న వయసు. అలాంటి వ్యక్తి నుంచి ప్రజలు ఊహించిన పాలన ఇదైతే కాదు. కారణాలు ఏవైనా కావచ్చు. ప్రస్తుత పాలన అంధకారంలో నడుస్తుందని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు. పేదలకు మేలు చేయాలన్న సానుకూల సంకల్పం కావచ్చు... మళ్లీ అధికారంలోకి రావాలన్న తపన కావచ్చు ఎక్కువగా ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. అభివృద్ధికి చేయాల్సిన ఖర్చంతా ఏవేవో పథకాల పేరు చెప్పి పంచేస్తున్నారు. అవి ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయో, ఏ విధంగా మార్పులు చెందుతున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజలంతా ఆనందంగా ఉన్నారనే సమాచారం మాత్రమే ముఖ్యమంత్రికి వెళుతోందంటున్నారు విశ్లేషకులు.


మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పటికైనా అభివృద్ధి మీద దృష్టి పెట్టక పోతే కష్టం. ఎక్కడా సరైన రోడ్లు లేవు. మూడు రాజధానులు అన్నారే తప్ప భవనాల నిర్మాణం జరగటం లేదు. నాడు నేడు పేరిట కొన్ని పాఠశాలలను బాగు చేస్తున్నారు, చాలా వాటిని మూసేస్తున్నారు. ఆర్భాటంగా పథకాలకు మీట నొక్కి ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఆ తరువాత వాటిని గాలికి వదిలేస్తున్నారు. అంధకారానికి చేసే ఈ అలంకారం ఎక్కువ కాలం నిలబడదు. ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించాలి. ఇప్పటికైనా కళ్ళు తెరచి, వాస్తవాలని గ్రహించాలి. అవసరమైన చోట అభివృద్ధికి పెద్ద పీట వేయాలి. ఈ ఏడాదిలో కనీసం మౌలిక సదుపాయాల కల్పన విషయంలోనైనా సానుకూల మార్పు రావలసిన అవసరం ఉంది. అదే విధంగా దాడులతో, దౌర్జన్యాలతో రాజ్యమేలుతున్న వైసీపీ నాయకుల అహంకారానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

అధికార గర్వంతో విర్రవీగిన వారు ఎంతో మంది కాలగర్భంలో కలిసిపోయారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నంత వరకే వీరి వెలుగు. వీరంతా మర్రిచెట్టు నీడలో వున్న గడ్డిపోచలే. ఆ చెట్టు పచ్చగా ఉన్నంత వరకే వీరికి విలువ. అందుకే ఎదిగే కొద్దీ ఒదగాలని పెద్దలు ఎప్పుడో చెప్పారు.

ఎన్నికల ఏడాదిలోకి వచ్చేశాం. కళ్ళు మూసి తెరచేలోగా ఎన్నికలు రానే వస్తాయి. మనం అధికారంలో వున్నప్పుడు సానుకూలతే కనిపిస్తుంది. మనం గీసుకున్న గిరి చుట్టూ వైఫైలా సానుకూల పవనాలు వీస్తుంటాయి. ఆ వలయంలో నుండి బయటకి రావాలి. కోటని కోటరీని పక్కన పెట్టి మళ్ళీ సామాన్య ప్రజల మధ్యకి రాజు రావాలి. క్షేత్ర స్థాయిలో తన మంత్రులూ సైన్యాధిపతులూ చేస్తున్న ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి. మళ్ళీ అధికారం రావాలంటే ఆయన మారాలి.

ఇది ప్రజాభిప్రాయం. విశ్లేషకుల మనోగతం. వైసీపీ కార్యకర్తల అభిమతం.

## కల్యాణ వైభవం...!



జిల్లా వైకాపా నాయకులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సోదరుడు పేర్నాటి రామలింగారెడ్డి - పద్మజల కుమారుడు **కౌషిక్ - మనస్వి** (యర్కారెడ్డి నిరంజన్‌రెడ్డి - మాధవీ లతల కుమార్తెల వివాహం జూన్ 1వ తేదీ మంగళగిరిలోని సి.కె కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.


## శ్రీసిటీలో.. రబ్బర్ బోర్డు ఛైర్మెన్

### --- ప్రపంచస్థాయి సదుపాయాలున్నాయని సంతృప్తి ---




కేంద్ర ప్రభుత్వ రబ్బర్ బోర్డు ఛైర్మెన్ డాక్టర్ సవార్ ధనానియా ఈనెల 7న అంతర్జాతీయస్థాయి పారిశ్రామికవాడ శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీలోని మౌళిక సదుపాయాలను, ప్రగతిని, ప్రత్యేకతలను ఆయనకు వివ రించారు. స్థానిక సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై జ్ఞాన్‌సర్కిల్ సమీపంలో ఇండియన్ రబ్బర్ మ్యానుఫ్యాక్చరర్స్ రీసెర్చ్ అసోసియేషన్(ఐఆర్ఎంఆర్ఏ) గుర్తింపు పొందిన ఓ స్వతంత్ర ప్రయోగశాలను డాక్టర్ సవర్ ధనానియా ఈ సందర్భంగా తనిఖీ చేశారు. ఈ ల్యాబ్ స్థానిక ఆటోమోటివ్ మరియు అనుబంధ పరిశ్రమలకు చెందిన రబ్బరు ఉత్పత్తుల నాణ్యత పరీక్షలు, విశ్లేషణ తదితర సేవలను అందిస్తుంది. అనంతరం ఆయన తన పర్యటనలో శ్రీసిటీ పరిసరాలను సందర్శించి, పారిశ్రామికవాడ మౌళిక సదుపాయాలను, పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు. శ్రీసిటీలో వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ప్రపంచస్థాయి సదుపాయాలతో మెగా ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేసినందుకు శ్రీసిటీ యాజమాన్యాన్ని అభినందించారు. ఆయన అంచనా మేరకు, శ్రీసిటీలోని పరిశ్రమలు రబ్బరు బొమ్మలు, విడి భాగాలను తయారు చేసే అధిక సామర్థ్యాన్ని కలిగి ఉండడం విశేషం. ఐఆర్ఎంఆర్ఏకి చెందిన డాక్టర్ రాజకుమార్, పాల్ వన్నన్ ఆయన వెంట ఈ పర్యటనలో పాల్గొన్నారు.

## పోలీసు జాగిలం.. 'డానీ'కి అంత్యక్రియలు



పోలీసు జాగిలం..జిల్లాలోని బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లో 2018 మే 18వ తేది నుంచి విధులు నిర్వహించిన 'డానీ' అకాలమృతి చెందడంతో జిల్లా పోలీసులు విచారానికి గురయ్యారు. కొద్దిరోజుల క్రితం డానీకి ఈ మండుటెండల ధాటికి వడదెబ్బ తగలడంతో అనారోగ్యం పాలైంది. వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ ఈనెల 6న మరణించింది. నెల్లూరు పెన్నానది ఒడ్డున పోలీసు లాంఛనాలతో డానీకి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా డానీ సేవలను స్మరించుకుంటూ జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి నివాళులర్పించారు. బెల్జియం మాలినోస్ జాతికి చెందిన ఈ జాగిలం పేలుడు పదార్థాలను గుర్తించడంలో దానికదే సాటి అని ఎస్పీ చెప్పారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో డానీ శిక్షణ పొందిందని, ఆ తర్వాత 2018లో నెల్లూరుజిల్లాలో విధులు నిర్వహించేదని తెలిపారు. డానీ సేవలు మరువలేనివని, దాని అకాలమరణం బాధాకరమని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ గాంధీ, ఆర్ఐ శ్రీనివాసులురెడ్డి, హ్యాండ్లర్ వెంకటేష్ తదితరులు పాల్గొని డానీకి నివాళులర్పించారు.



# 'మహిళా వస్తాదులతో బీజేపీ 'కుస్తీ...'!

'అజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా... ఇప్పుడు ఓ బీజేపీ నేత 'ఘనత'ను ముచ్చటించుకుందాం. ఆయన ఒక్కడినే ముచ్చటించుకుంటే.... బీజేపీతో సహా ఇతర సమస్త రాజకీయ పార్టీల్లోని ఆయన వంటి సకల సద్గుణాభిమాన ధనులకు కోపం రావచ్చు, తమను వదిలేశారు ఏంటీ కత... అని. కనుక, వారందరికీ గౌరవాభినందన మందార మాలలు మనస్సుల్లోనే సమర్పించు కుంటూ.... ఈ బీజేపీ నేత గురించి మాట్లాడుకుందాం.

ఆయన పేరు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్. బీజేపీ సభ్యుడుగా ఆరుసార్లు లోకసభకు ఎన్నికయ్యారు. ఒకసారి సమాజవాది టికెట్‌పై గెలిచారు. అయినప్పటికీ, ఆయన వయసు కేవలం అరవై ఆరు సంవత్సరాలే. శరీరంలోని అన్ని అవయవాలు చురుగ్గా పనిచేస్తుంటాయని ఆయన గురించి తెలిసినవారు అంటుంటారు. ఛాతి కూడా విశాలమైనదని ఆయన విజువల్స్ చూసిన వారికి తెలుస్తుంది. 56 అంగుళాలకు పై మాటే. ఏకంగా ఇద్దరు ముగ్గురు వస్తాదుల్లాంటి ఆడపిల్లలను ఏక కాలంలో అక్కున చేర్చుకునేంత విశాలమైన హృదయం ఆయనది.

ఆయన గత పదేళ్లుగా "ఆ పని"లోనే ఉన్నట్లుగా భారత దేశానికి అంతర్జాతీయ స్థాయిలో కుస్తీ పోటీలలో పథకాలు సాధించిన మన ఆడపిల్లలు కళ్ళ నీళ్ల పర్యంతమవుతూ, కనపడిన వారికల్లా చెబుతున్నారు. భారత కుస్తీ సమాఖ్య (రెజిలింగ్ ఫెడరేషన్ అఫ్ ఇండియా)కు ఆయన అధ్యక్షుడుగా.... తమను గౌరవంగా అస్సలు బతకనివ్వడం లేదని ఆ ఆడపిల్లలు గగ్గోలు పెడుతుంటే, ఢిల్లీలోనే ఉన్న బీజేపీ పెద్దలకు వినపడడం లేదు. జనవరి నుంచి వాళ్ళు వీధులలో పడి, 'బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేసి, మా గౌరవాన్ని కాపాడండి' అంటూ వాళ్ళు ఢిల్లీ జంతర్ మంతర్‌లో ధర్నాలు, ఆందోళనలు చేస్తుంటే... కేంద్రం ఉలకడం లేదు..., పలకడం లేదు.'అజాదీకా అమృత్ మహోత్సవ్ ఓహో!' అంటూ రంగురంగుల చొక్కాలు, గెడ్డాలతో దేశమంతా తిరుగుతున్నారు. ప్రతిపక్షాలలో 'ఎవరు' ఈడీకి, సీబీఐకి దొరుకుతారా అని దేశమంతా వెదుకుతున్నారు.

దేశం లోని పలువురు ప్రముఖ క్రీడాకారులు వారికి మద్దతు ప్రకటించారు. కేజ్రీ వాల్, మమతా బెనర్జీతో సహా ప్రతిపక్ష ముఖ్యమంత్రులు(ఒకరిద్దరు తప్ప) పలువురు తమ మద్దతు ప్రకటించారు. ఎవరు ఎన్ని గుండెలు బాదుకున్నా..., ఎవరు గొంతులు చించుకున్నా... కేంద్ర ప్రభుత్వ పెద్దలలో కనీస స్పందన ఉం డడం లేదు. వారంతా.. 'అజాదీ కా అమృత్ మహోత్సవ్'లో బిజీబిజీగా ఉన్నారు.

ఏ విషయం ప్రస్థావించడానికి మన ఆడపిల్లలు సహజంగా తీవ్ర విముఖత వ్యక్తం చేస్తారో..., అదే విషయాన్ని ఎలుగెత్తి చాటడానికి నాలుగైదు నెలలుగా ఉద్యోగాలు, కుటుంబాలు పక్కన పెట్టి రోడ్లమీద పడ్డారో అన్నవిషయానికి మన సమాజంలో వీసమెత్తు విలువలేకుండా పోయింది. మన సమాజంలో పథకాలకు, నినాదాలకు, రాజకీయాలకు ఉన్న విలువ... మనుషులకు, వారి మాన మర్యాదలకు లేకుండా పోయింది అనడానికి.. ఇంతకుమించిన సజీవ ఉదాహరణ ఏముంటుంది?

తాము, తమ ఆత్మాభిమానం కోసం, మాన మర్యాదల కోసం ఇంతగా రోడ్ల మీద పడి ఆక్రోశిస్తున్నా... స్పందన కొరవడడంతో కుపితులైన భారత మహిళా వస్తాదులు..., చివరకు బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై దర్యాప్తును కోరుతూ భారత సర్వోన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది.

అంటే, మన సమాజంలో చట్టబద్ధ పాలన లేదని అర్ధమా? లేకపోతే, ఒక నేరం దర్యాప్తుకు బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించ వలసిన ఖర్మ ఏమిటి!

మహిళా వస్తాదులను గత పదేళ్లుగా చెరబడుతున్నారనే ఆరోపణలు ఎదుర్కొం టున్న బ్రిజ్ భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదుచేసి దర్యాప్తు చెయ్యమని చివరికి సుప్రీమ్ కోర్టు చెబితే తప్ప, ఢిల్లీ పోలీసులలో చలనం కలగలేదు. చివరకు ఆయనపై ఢిల్లీ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి చేతులు దులి పేసుకున్నారు. అయినా, బ్రిజ్ భూషణ్ తలలో ఒక్క వెంట్రుక కూడా ఊడలేదు. ఆయన... నవ్వుతూ, తుళ్లుతూ, ప్రేలుతూ ఢిల్లీలో తిరుగుతూనే ఉన్నారు.

అదీ మన రాజకీయ వ్యవస్థలో ఆయన రేంజ్. అది అంతా, ఇంతా కాదు. 'అజాదీ కా అమృత్ మహోత్సవ్...' మరి.

బ్రిజ్ భూషణ్ ట్రాక్ రికార్డుకు మొదటి నుంచీ తిరుగులేదు.

ఇంటర్నేషనల్ స్మగ్లర్, మర్డరర్, కిడ్నాపర్, భారత్ వ్యతిరేకి, పాక్ మిత్రుడు అయిన దావూద్ ఇబ్రహీం అనుచరులను రహస్యంగా దాచిపెట్టారనే సవాలక్ష ఆరోపణలపై ఇతడిని పోలీసులు ఒకసారి లోపలేశారు. మన దేశంలో 99శాతం నేరాలకు, ఘోరాలకూ సాక్ష్యాలు దొరకనట్టే... ఈ కేసులోనూ సాక్ష్యాలు 'దొరకలేదు'.

ప్రస్తుతం ఏడుగురు మహిళా వస్తాదులు ఆయనపై కేసు నమోదు చేశారు, తమను బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేధించాడు అని. అయినా, కింగ్‌లా బోర విరుచుకుని బ్రిజ్ భూషణ్.. రాజకీయాలలో తిరుగుతున్నాడు. బీజేపీ ఎం.పీ కదా! అదీ అసలు కిటుకు.

ఆయన తొలినుంచీ వివాదాస్పదుడు అయినప్పటికీ, రాజకీయాల్లో ఓ వెలుగు వెలగడానికి ప్రధాన కారణం బీజేపీ ఎంపీ అని చెప్పవచ్చు. ఇతని అరాచకాలు చూడలేక, ఇతని పెద్ద కొడుకు శక్తి శరణ్‌సింగ్, 23 ఏళ్ళ వయసులో... తమ పిస్టల్‌తో కాల్చుకుని 2004లోనే ఆత్మహత్య చేసుకున్నాడు.

దొంగతనం, దోపిడీ, వేధింపులు, హత్య, హత్యాయత్నం, కిడ్నాపింగ్ మొదలైన నేరారోపణలపై బ్రిజ్ భూషణ్‌పై 1974 నుంచి 2007 మధ్యకాలంలో 38 క్రిమినల్ కేసులను పోలీసులు నమోదు చేశారు. కానీ, ఏదీ రుజువు అయినట్టు లేదు. అత్యంత కఠినమైన 'యాంటీ – గూండా' యాక్టు కింద కూడా ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు కేసులు పెట్టారు గానీ, నిలవ లేదు.

గత ఏడాది ఒకసారి ఒక వెబ్‌సైట్‌కు ఆయన ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో 'గతంలో ఓ సారి మర్డర్ చేశాను. నా స్నేహితుడు రవీందర్‌ను ఒకతను కాల్చి చంపాడు. అందుకని, అతన్ని నేనే మర్డర్ చేశాను. జనం ఏమనుకుంటే... అది అనుకోనీ...' అని చెప్పాడు. అయితే, యధావిధిగా ఈ కేసులోనూ సాక్ష్యాలు దొరకలేదు.

భారత కుస్తీ సమాఖ్యకు అధ్యక్షుడుగా తాను ఎందుకు ఉన్నాడో కూడా ఆయన ఒకసారి చెప్పారు.






'ఈ సమాఖ్యలో ఉండేవారు మగ పిల్లలు గానీ, ఆడ పిల్లలు గానీ చాలా ధృడంగా ఉంటారు. వారిని మేనేజ్ చెయ్యాలంటే... అంతకంటే ధృడంగా ఉం డాలి కదా! నాకంటే ఎక్కువ ధృడంగా ఉండేవాళ్ళు ఈ దేశంలో ఇంకెవరు ఉన్నారు?'

ఉత్తర్‌ప్రదేశ్ బీజేపీ రాజకీయాల్లో ఆయనో విలువైన నాయకుడు, మరి. ఆయన ఏ సమాజ్‌వాదీ పార్టీ నాయకుడో లేదా బీఎస్పీ నాయకుడో అయి ఉంటే, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగి, ఈ పాటికి ఆయన ఇంటిని బుల్‌డోజర్లతో నేల మట్టం చేసి ఉండేవారు. పోలీసులు అరెస్ట్ చేసి ఉండేవారు. కోర్టుకు తీసుకు వెళుతున్న సమ యంలో బ్రిజ్ భూషణే... ఎస్కార్ట్ పోలీసుల చేతుల్లోని తుపాకీ లాక్కుని, వారిపై కాల్పులు జరిపి ఉండేవాడు. ఇక, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎస్కార్ట్ పోలీసులు... ఆత్మ రక్షణార్థం జరిపిన కాల్పుల్లో బ్రిజ్ భూషణ్ అక్కడికక్కడే హతుడై ఉండేవాడు. ఈ ఎదురు కాల్పుల్లో ఒక ఎస్కార్ట్ పోలీసు ఎడమ చేతి చిటికిన వేలికి గాయమవడంతో, హుటాహుటిని ఆస్పత్రికి తరలించి ఉండేవారు. కానీ బ్రిజ్ భూషణ్ బీజేపీ ఎం.పీ కదా!

ఇప్పుడు, దేశం అంతా ఎదురు చూస్తున్నది, తమ రౌడీ ఎం.పీని బీజేపీ ఏమి చేస్తుందీ అనేది చూడడానికి.

అతనిపై చర్యలు తీసుకోకపోతే, అంతర్జాతీయ కుస్తీ పోటీలలో... దేశం తరపున తాము సాధించిన పతకాలను గంగా నదిలో నిమజ్జనం చేసి, ఓ తర్పణం వదులుతామని మహిళా వస్తాదులు ప్రకటించారు.

అయినా, బ్రిజ్ 'భాయ్'పై చర్యలు లేవు. వారు వెళ్లి హోమ్ మంత్రి అమిత్ షాను కలిశారు. 'చట్టం ముందు అందరూ సమానమే కదా అమ్మా ...' అని ఆయన నిట్టూర్పు విడిచారు.

'చట్టం తన పని తాను చెయ్యాలి కదా' అని క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఒక విషయం మాత్రం మన మహిళా వస్తాదులకు ఈ పాటికి అర్ధమై ఉండాలి.

న్యాయం, ధర్మం కోసం తాము చేసే కుస్తీ కంటే, మూడోసారి అధికారంలోకి రావడానికి కేంద్ర బీజేపీ పెద్దలు చేసే కుస్తీ ముఖ్యమైనది. ప్రతిపక్ష నేతలపై సీబీఐ, ఈడీలను ఉసి గొలపడం అనే కుస్తీ ముఖ్యమైనది. రాష్ట్రాలలో అధికారాన్ని చేజిక్కించుకోడానికి, చేజిక్కిన దానిని పదిలం చేసుకోడానికి బీజేపీ కేంద్ర పెద్దలు సామ, దాన, భేద, దండోపాయాలతో చేసే కుస్తీ చాలా ముఖ్యమైంది.

అందుకే, ఇంతటి అల్లరి, అప్రతిష్ట తరువాత కూడా దేశంలో వందలు, వేలాదిగా ఉన్న బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌లు రాజకీయాలను శాసిస్తున్నారు. 'నా వెంట్రుకలు పీకలేరు...' అంటూ సవాలు చేస్తున్నారు.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

ఆహ్వానము




ప్రవచన సుధాకరులు, వి.ఆర్. కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు
కీ॥శే॥ మోపూరు వేణుగోపాలయ్య గారి స్మృత్యంకంగా
గురువుకి వందనం
కార్యక్రమము.
తేది : 12.06.2023, సోమవారం ఉదయం 9.30 గంటలకు,
నెల్లూరు శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలోని
'రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం' నందు జరుగును.
ఈ కార్యక్రమంలో...
ముఖ్యఅతిథిగా
భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి వర్యులు
ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు
పాల్గొని, శ్రీ మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచిక
'ప్రవచన సుధాకరుని'
'వేణు'నాదం
ఆవిష్కరిస్తారు.
విశిష్ట అతిథులుగా
'పద్మభూషణ్' డాక్టర్ కే.ఐ. వరప్రసాద్‌రెడ్డి గారు
వ్యవస్థాపక ఛైర్మన్ 'శాంతా బయోటెక్నిక్స్'
డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి గారు
సాంకేతిక సలహాదారు 'భారత రక్షణ మంత్రిత్వ శాఖ'
యం.వీ.రాయుడు గారు
వ్యవస్థాపకులు, 'మనసు ఫౌండేషన్'
తుంగా శివప్రభాత్‌రెడ్డి గారు
సంపాదకులు, 'లాయర్' వారపత్రిక
పాల్గొంటారు.
: మీ ఆగమనాభిలాషులు :
టి.రమణయ్య, ముఖ్య సమన్వయకర్త
మరియు శ్రీ మోపూరు వేణుగోపాలయ్య ఆత్మీయ బృందం



అందరూ ఆహ్వానితులే..!

# ‘స్మార్ట్ మీటర్ల కుంభకోణం’పై సిబిఐ విచారణ జరగాలి

**మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి డిమాండ్**



రాష్ట్రంలో ‘స్మార్ట్‌మీటర్ల’ ముసుగులో వేలాది కోట్లను దిగమింగుతున్నారని, కేంద్రప్రభుత్వం వెంటనే ఈ కుంభకోణంపై దృష్టిపెట్టి సీబీఐ చేత విచారణ జరిపించాలని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు.

ఈనెల 7న అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, స్మార్ట్‌మీటర్ల కొనుగోలులో వైకాపా ప్రభుత్వం దాదాపు 17వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఇతర రాష్ట్రాలు ఒక్కో స్మార్ట్‌మీటర్‌ను కేవలం 4వేల రూపాయలకు కొంటుంటే, వైకాపా ప్రభుత్వం మాత్రం వాటిని 36 వేల రూపాయల వంతున కొంటోందని, ఈ కొనుగోళ్లలో భారీ కుంభకోణం జరుగుతోందని, ఆ భారమంతా కరెంటు బిల్లుల్లో ప్రజల నెత్తిన రుద్దబోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఇలాంటి దోపిడీలు చూస్తుంటే, మధ్యయుగంనాటి పిండారీలు, దోపిడీదొంగలు గుర్తుకొస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఈ డబ్బంతా అవినాశ్‌రెడ్డి సంస్థ అయిన షిరిడీసాయి ఎలక్ట్రికల్స్‌కు దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకోసం నేరుగా ప్రజల జేబులు కొట్టేయడానికి ప్రభుత్వం సిద్ధమైందని ఆయన ఆరోపించారు. నిన్నటివరకు ప్రకృతిసంపదను దోచుకున్న పాలకులు, నేడు ఏకంగా ప్రజల జేబులకు చిల్లుపెట్టడానికి సిద్ధమయ్యారని ఆయన ధ్వజమెత్తారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వ్యవహారంలో కూడా భారీ ఎత్తున కుంభకోణం జరుగుతోందని, అయినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోకపోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. వైకాపా అవినీతి కుంభకోణాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయని, వ్యవసాయ మీటర్లలో రూ.7వేల కోట్లు, గృహాల మీటర్లలో రూ.10వేల కోట్లు, మొత్తంగా రూ.17వేల కోట్ల కుంభకోణం జరుగుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం ఏమిటి?.. రాష్ట్రంలో జరిగే ఈ కుంభకోణాలు ఏవీ కేంద్ర ప్రభుత్వానికి కనిపించడంలేదా?.. అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి భారీ కుంభకోణంపై కేంద్రం స్పందించకుంటే, రాష్ట్రంలో జరిగే ‘స్మార్ట్ మీటర్ల’ దోపిడీపై న్యాయస్థానాల్ని ఆశ్రయించైనా సరే, సీబీఐ విచారణ జరిగేలా చూస్తామని ఆయన స్పష్టం చేశారు.

# మహావిష్ణు బ్రహ్మోత్సవాలు..10 నుంచి

నెల్లూరు వేదాయపాళెంలో ఉన్న శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ గురువాయూర్ మహావిష్ణు స్వామి బ్రహ్మోత్సవాలు జూన్ 10 నుంచి 15వ తేది వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, భక్త బృందాల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులందరూ ఈ ఉత్సవాలకు తరలివచ్చి స్వామివార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.


నేత్ర వైద్యనిపుణులకు సుస్వాగతం!

1993లో డా॥ P.L.రావు గారి దృఢ సంకల్పంతో ప్రారంభమై నేత్ర వైద్యరంగంలో నూతన ఒరవడితో అత్యాధునిక టెక్నాలజి, అత్యున్నత ప్రమాణాలతో దిగ్విజయంగా కొనసాగుతున్న

మాడరన్ ‘ఐ’ హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్

విజయ ప్రస్థానంలో స్వర్గీయ డా॥ P.L. రావు గారి ఏకైక కుమార్తె-అల్లుడు డా॥ పి.చిన్మయి - డా॥ జి.విష్ణుతేజ ల చేరికతో కానున్నది మాడరన్ ‘ఐ’ హాస్పిటల్ మరింత బలోపేతం.



కీ॥శే॥ Dr. P.L. రావు గారు
వ్యవస్థాపకులు



Dr.G.Vishnu Teja
M.S., F.A.C.S., FAEH (Aravind - Madurai)
Additional Medical Director
Cataract, Comprehensive, Cornea and Refractive Surgery Services



Dr.P. Chinmayee
M.S.,F.I.G.S (Aravind - Madurai)
Additional Medical Director
Glaucoma and Cataract Consultant

అరవింద్ ‘ఐ’ హాస్పిటల్, మదురైలో విశేష అనుభవం గడించి మాడరన్ ‘ఐ’ హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్‌లో అడిషనల్ మెడికల్ డైరక్టర్స్‌గా వైద్యసేవలు అందించనున్న డా॥ జి.విష్ణుతేజ, డా॥ పి.చిన్మయి లకు సుస్వాగత శుభాకాంక్షలు

BR

For Appointments, Please Contact 94942 92957, 0861-2324868

మాడరన్ ‘ఐ’ హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్
డా॥ P.L.రావు స్ట్రీట్, పొగతోట, నెల్లూరు. ఫోన్:2306015

మాడరన్ రెటీనా సెంటర్
16-11-99, హోటల్ వెంకటరమణ వెనుక వీధి, పొగతోట, నెల్లూరు





Tunga RajaGopala Reddy Garu
Founder

I CONGRATULATE LAWYER AND IT'S TEAM ON COMPLETION OF 42 SUCCESSFUL YEARS.

లాయర్

COMPLETION OF 42 GLORIOUS YEARS

With Best Compliments



ANAPALLI ASHOK KUMAR REDDY


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com